మానేరు **జనత** ®
తెలుగు దినపత్రిక · ఇది జనం గొంతుక
29.12.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 250 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## ఎదురులేని భారత్..

లంకపై వరుసగా నాలుగో విజయం
స్మృతి, షెఫాలీ వీరవిహారం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989887251
- ఎడిటర్

# ఈ ఏడాది భారత్‌కు గర్వకారణం

ఆపరేషన్ సిందూర్ నుంచి ప్రపంచ కప్ వరకూ
2025లో ఎన్నో మైలురాళ్లు అధిగమించాం
ప్రతిచోటా భారత దేశ ప్రభావం స్పష్టం
కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి
ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్'లో మోదీ

3



# జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణం

డైవ్లో సార్టీలో అబ్దుల్ కలాం తర్వాత పాల్గొన్న రెండో రాష్ట్రపతిగా రికార్డు
కార్వార్ నౌకాస్థావరం నుంచి ఐఎన్ఎస్ వాఘ్షీర్లో సాహసయాత్ర

3





## బీఆర్ఎస్ అన్యాయాన్ని ఎండగట్టాలి

శ్రీశైలానికి మార్చడంతోనే..
'పాలమూరు' ఆలస్యానికి ఇదే కారణం
జూరాల నుంచి చేపట్టి ఉంటే ఇప్పటికే పూర్తయ్యేది
సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు


**జనతా న్యూస్, హైదరాబాద్ :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని ఆధారాలతో సహా ఎండగట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూరాల జలాశయం నుంచి చేపట్టాల్సిన ఈ ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చడం వల్లే సమస్యలు తలెత్తాయన్నారు. 2013లో జూరాల రిజర్వాయర్ నుంచి ఈ పథకాన్ని ప్రతిపాదించారని గుర్తుచేశారు. ఈ జలాశయం పూర్తిగా తెలంగాణ అధీనంలోనే ఉండడం వల్ల పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎలాంటి సమస్యలూ వచ్చేవి కాదని.. కృష్ణా నుంచి వచ్చే జలాలను వచ్చిన వాటిని వచ్చినట్లే తరలించుకునే అవకాశం ఉండేదని చెప్పారు. ఆదివారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో

మిగతా 2 లో


**ప్రజాస్వామ్యం కోసం పురుడు పోసుకున్న కాంగ్రెస్**
'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు

# సాగునీటి ప్రాజెక్టులపైనే చర్చ!

## నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు..



పాలమూరు-రంగారెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ గరంగరం
కేసీఆర్ సభకు వస్తే సాగునీటిపై చర్చకు సిద్ధమన్న సీఎం
తామూ చర్చకు సిద్ధంగానే ఉన్నామన్న కేటీఆర్, హరీశ్
సభను హుందాగా న డుపుతాం: మంత్రి శ్రీధర్‌బాబు
సర్కార్ వైఫల్యాల్ని ఎండగడతాం: బీజేపీఎల్పీ నేత ఏలేటి
నేటి సభలో మొదట డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
పలు బిల్లులను సభ ముందుంచనున్న ప్రభుత్వం
ఇటీవల మరణించిన మాజీ సభ్యులకు సంతాపాలు
ఆపై జనవరి 2కు వాయిదా.. అనంతరం బీఏసీ భేటీ



**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో సాగునీళ్ల అంశంపై వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ అంశంపై కొద్దిరోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నీటి కేటాయింపులు, ప్రాజెక్టులు తదితర అంశాలపై సభలో కూడా చర్చ జరగనుంది. ఇందుకోసం

మిగతా 2 లో

## నేడు అసెంబ్లీకి కేసీఆర్

# ఏప్రిల్ నుంచి జీరామ్‌జీ!

పాత 'ఉపాధి' చట్టం కటాఫ్ తేదీపై
త్వరలోనే కేంద్రం నోటిఫికేషన్

చట్టం అమలుకు రాష్ట్రాలు బిల్లు ఆమోదించుకోవాలి..
40% వాటా భరించాల్సి రావడమే కారణం
వీబీ జీరామ్‌జీపై ప్రతిపక్షాల పోరు ఫలిస్తుందా?..
కేంద్రం వెనక్కి తగ్గుతుందా.. లేక ముందుకేనా?
కొత్త పథకంలో ఇప్పటి జోరుతో పనులు సాగేనా?..
రాష్ట్రాలను, లబ్ధిదారులను వేధిస్తున్న ప్రశ్నలెన్నో!

వివరాలు 3 లో



దేశంలో పేదలకు ఉపాధి హామీకి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తెచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీరామ్‌జీ)' 2026 ఏప్రిల్ నుంచే అమల్లోకి రానుంది. దీనిపై త్వరలోనే కేంద్రం నుంచి ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవలే పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ చట్టంలో.. రాష్ట్రాలు ఆరునెలల్లోపు దీని అమలుకు అనుగుణంగా విధివిధానాలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు.

ప్రతిఫలం కాంక్షించి చేస్తే

## సేవ కాదు



బలవంతంగా చేసే పని సేవ అనిపించుకోదు
ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు
కన్హా శాంతివనంలో ముగిసిన విశ్వ సంఘ్ శిబిరం

4



కేసీఆర్‌ది రైతు పాలన..

## రేవంత్‌ది రాబంధు పాలన

కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ ప్రోగ్రెస్ నిల్

కృష్ణా జలాల విషయంలో బాబు చెప్పినట్టే రేవంత్ ఆడుతున్నడు: కేటీఆర్
కేసీఆర్‌కు పేరు వస్తుందనే సాగునీటి ప్రాజెక్టులను రేవంత్‌రెడ్డి పండబెట్టిండు
రైతుబంధు పాలన పోయి తెలంగాణ రాష్ట్రంలో రాబందుల పాలన వచ్చింది
యూరియా కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి తెచ్చిండ్రు
నాగర్‌కర్నూల్‌లో సర్పంచ్‌లకు సన్మానం

3

# దక్షిణ మధ్య రైల్వేకు 19,314 కోట్ల ఆదాయం

## జనవరి నుంచి నవంబరు వరకు నమోదు

**హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు రికార్డు స్థాయిలో రూ.19,314 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. గత ఏడాది ఇదేకాలంలో వచ్చిన ఆదాయం (రూ.18,831 కోట్లు)కన్నా ఇది రూ.483 కోట్లు ఎక్కువ. ఈసారి ప్రధానంగా 136.2 మిలియన్ టన్నుల సరకు రవాణాతో రూ.12,841 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రయాణికుల నుంచి చార్జీల ద్వారా రూ.5,525 కోట్ల ఆదాయం వచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్‌లలో రైళ్ల రద్దీ తగ్గించేందుకు ఈఏడాది చర్లపల్లిలో నూతన శాటిలైట్ టెర్మినల్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్లుగా పునరాభివృద్ధి చేసినట్టు తెలిపారు. రూ.2.2 కోట్ల వ్యయంతో కాచిగూడ హెరిటేజ్ స్టేషన్‌ను ఇండో-గోథిక్ శైలిలో పునరుద్ధరించినట్టు పేర్కొన్నారు. సంజామల, యేర్పేడు, జనపహాడ్‌ల వద్ద కార్గో గతి శక్తి టెర్మినల్స్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. 68 ప్రాంతాల్లో మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించి 22 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 60 రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మించినట్టు వివరించారు. ఈ ఏడాది కొత్తగా 199 కిలోమీటర్ల ట్రాక్‌ను అభివృద్ధి చేయగా.. ఇందులో 144 కిలోమీటర్లు మూడో లైన్, 40 కిలోమీటర్ల డబుల్ లైన్ ఉన్నాయి. వంద శాతం విద్యుదీకరణ పూర్తవడంతో సికింద్రాబాద్ డివిజన్ ప్రత్యేక ఘనతను పొందింది.

**సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు...**

సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. జనవరి 7 నుంచి 12 వరకు హైదరాబాద్ నుంచి/మీదుగా మొత్తం 11 ప్రత్యేక రైళ్లు ప్రయాణీకులకు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 7, 8, 9 తేదీల్లోకాకినాడ నుంచి వికారాబాద్‌కు మూడు, 8న సికింద్రాబాద్-పార్వతీపురం మార్గంలో ఒకటి, 9న పార్వతీపురం నుంచి సికింంద్రాబాద్‌కు ఒకటి, 9, 10 తేదీల్లో వికారాబాద్ నుంచి పార్వతీపురంకు రెండు, 10న పార్వతీపురం నుంచి వికారాబాద్‌కు ఒకటి, 12న పార్వతీపురం-కాకినాడ మధ్య ఒకటి, 8, 10 తేదీల్లో వికారాబాద్-కాకినాడ మార్గంలో 2 ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లకు అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ బుకింగ్ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

# ఐబొమ్మ రవి ఎవరో నాకు తెలియదు

## పోలీసుల విచారణలో వెల్లడించిన ప్రహ్లాద్

**హైదరాబాద్ :** సినిమా పైరసీ, కాపీరైట్ ఉల్లంఘన, మనీ లాండరింగ్ కేసుల్లో అరెస్టయిన ఐ బొమ్మ రవికి సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు రాబట్టినట్లు తెలిసింది. ప్రహ్లాద్ పేరుతో రవి డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు తీసుకున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆ ప్రహ్లాద్‌ను పిలిచి విచారించారు. రవిని, ప్రహ్లాద్‌ను ముఖాముఖి విచారిర చగా, అసలు రవితో తనకు పరిచయమే లేదని ప్రహ్లాద్ స్పష్టంచేసినట్లు తెలిసింది. ప్రహ్లాద్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించి, ఆదివారం హైదరాబాద్‌కు పిలిచి విచారించగా ఈ విషయం బయటపడింది. డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులోని వివరాలను ప్రహ్లాద్‌కు చూపించగా, ఆ వివరాలు తనవేనని.. కానీ వాటిని రవి ఎలా తీసుకున్నాడో తెలియదని స్పష్ట చేశాడు. దీంతో ఇద్దరికీ పరిచయం లేదని పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. ప్రహ్లాద్ వివరాలను రవి ఎక్కడి నుంచి సంపాదించాడు..? ఎలా సంపాదించాడు..? అనేది తేలాల్సి ఉంది.

# భారత్ ఎదుగుదలకు నెహ్రూ విధానాలే పునాది

## స్వాతంత్ర్య పోరాటం, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎనలేనిది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్


**హైదరాబాద్ :** నాడు ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ అవలంభించిన విధానాలతో ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచేందుకు అవకాశం లభించిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో గుండు సూది తయారు చేయలేని స్థితి నుంచి నేడు రాకెట్ ప్రయోగాల వరకు దేశం ఎదగడానికి నెహ్రూ వేసిన పునాదులే కారణమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య పోరాటంలో, అనంతరం దేశ నిర్మాణంలోనూ కాంగ్రెస్ పాత్ర ఎనలేనిదన్నారు. 141వ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్ విగ్రహాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకట్‌స్వామి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా మోతే రోహిత్‌పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆనాడు నెహ్రూ ప్రధాని కానిపక్షంలో దేశ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేమన్నారు. అప్పట్లో ఇందిరాగాంధీ అంటే పాకిస్థాన్ గడగడలాడేదని, కానీ నేడు మోదీ పాక్‌కు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. దేశం సామాన్యుల చేతికి రావాలని బ్యాంకుల జాతీయీకరణ ఇందిరాగాంధీ చేస్తే.. సాంకేతికతను రాజీవ్‌గాంధీ పరిచయం చేశారన్నారు. ఆర్థిక సంస్కరణలతో పీవీ నరసింహారావు దేశాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారని.. కానీ నేడు మోదీ మాత్రం గాంధీ పేరు తొలగించి ఉపాధి పథకాన్ని నీరు గారుస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పెత్తందారు పార్టీగా మారిందని, పేదలను దోచి అదానీ-అంబానీలకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, అందులో ఉండటం మన అదృష్టమన్నారు. రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాగా, కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి సెక్రటేరియెట్ వరకు తలపెట్టిన ర్యాలీని మహేశ్ గౌడ్ ప్రారంభించారు.

# అసెంబ్లీలో బలమైన స్వరం వినిపించండి

## బీజేపీ ఎమ్మెల్యేలకురాంచందర్‌రావు దిశానిర్దేశం

**హైదరాబాద్, డిసెంబరు 28 :** అసెంబ్లీలో బలమైన స్వరం వినిపించాలని, సర్కారు వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. బలమైన ప్రజాపక్షంగా నిలబడి, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రాంచందర్‌రావు కీలక భేటీ నిర్వహించారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానాలు రాబట్టే విధంగా బీజేపీ అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. సభలో సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రభావవంతంగా లేవనెత్తాలని సభ్యులకు రాంచందర్‌రావు సూచించారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ సమావేశానికి రాని ఎమ్మెల్యేలకు ఆయన ఫోన్ చేసి పార్టీ ఉద్దేశాలను వివరించారు.

# సాగునీటి ప్రాజెక్టులపైనే చర్చ!



**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం అన్ని వివరాలను సిద్ధం చేస్తోంది. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై కీలక చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుపై సభలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిసింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత పదేళ్లలో చేపట్టిన కొత్త నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికోసం చేసిన ఖర్చు, తద్వారా ఎంత ఆయకట్టుకు నీళ్లు అందాయన్న వివరాలతో పాటు కృష్ణా, గోదావరి జలాల్లో ఏపీ, తెలంగాణకు కేటాయింపులు, అందుకు సంబంధించిన ఒప్పందాలు సభలో చర్చకు రానున్నట్లు సమాచారం. ఒకరోజు మొత్తం ఈ అంశంపై చర్చకే కేటాయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ చాలాకాలం తర్వాత సభకు వచ్చే అవకాశం ఉండటంతో సాగునీటి అంశాన్ని లోతుగా చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'అధికార పార్టీ తోలు తీస్తాం. సాగునీటి విషయంలో నిజాలు నిగ్గు తేలుస్తాం' అంటూ బచావత్ ట్రిబ్యునల్ అంశాన్ని లేవనెత్తారు. కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే నీళ్ల కేటాయింపులపై అన్ని విషయాలు చర్చిద్దామని సవాల్ విసిరారు. దీంతో సమావేశాల్లో కూడా వాడివేడి చర్చ తప్పదని భావిస్తున్నారు.

**డిప్యూటీ స్పీకర్ ఎన్నికతో మొదలు..**

సోమవారం ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే మొదట డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. ఆ వెంటనే పలు బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. ఇటీవల ప్రభుత్వం జారీచేసిన పలు ఆర్డినెన్స్‌లకు సంబంధించిన బిల్లును సభ ముందు ఉంచనున్నారు. తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (అమెండ్ మెంట్) బిల్లు-2025తోపాటు తెలంగాణ మునిసిపాలిటీస్ చట్ట సవరణ బిల్లు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్ట సవరణకు సంబంధించిన రెండు బిల్లులను సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశపెడతారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ సమగ్ర శిక్ష (టీఎసఎస్) ఆడిట్ రిపోర్టుతోపాటు అదే కాలానికి సంబంధించి పీఎంశ్రీ ఆడిట్ రిపోర్టును కూడా సీఎం సభ ముందు ఉంచుతారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్, వేతన నిబంధనలకు సంబంధించిన రెండు బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెడతారు. పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుతోపాటు ఎంపీపీ, జడ్‌పీపీలకు సంబంధించి ఇటీవల ప్రచురించిన గెజిట్‌ను ఆ శాఖ మంత్రి సీతక్క సభ ముందు ఉంచుతారు. తెలంగాణ హార్టికల్చర్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల ఆడిట్ నివేదికలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సభకు సమర్పిస్తారు. ఆ తర్వాత ఇటీవల మరణించిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు అసెంబ్లీ, మండలిలో సంతాపం ప్రకటిస్తారు. అనంతరం జీరో అవర్ చేపడుతారు. ఆ తర్వాత సభలను వచ్చే ఏడాది జనవరి 2వ తేదీకి వాయిదా వేస్తారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరగనుంది. సభలను ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశాన్ని ఈ సమావేశంలో ఖరారు చేస్తారు.

**సభను హుందాగా నడుపుతాం: శ్రీధర్‌బాబు**

శాసనసభ శీతాకాల సమావేశాలను హుందాగా నడుపుతామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెద్దాయన సభకు వస్తే ఆయన గౌరవానికి ఎక్కడా భంగం కలిగించబోమని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేసీఆర్ అనుభవం అవసరమని.. సలహాలు, సూచన లు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు.

**చర్చకు మేం సిద్ధం: కేటీఆర్**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సహా సాగునీటి అంశంపై సభలో చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పాలమూరును సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ వలసల జిల్లాగా మార్చారని ఆదివారం ఆయన ఆరోపించారు. పాలమూరుకు నీళ్ల కోసం పోరాటానికి కేసీఆర్ సిద్ధమని తెలిపారు. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వ చ్చీరాగానే ఆ ప్రాజెక్టు టెండర్లను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల జలాలు చాలు అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. అధికార పార్టీ వాళ్లు ఇబ్బందుల్లో పడిన ప్రతిసారీ అసెంబ్లీ నిర్వహించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ఏ చర్చపెట్టినా తాము మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**సాగునీటి రంగం అస్తవ్యస్తం: ఏలేటి**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సాగునీటి రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా కృష్ణా, గోదావరి బేసిన్లపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించలేదని మండిపడ్డారు. మైనర్ ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని.. చెరువులు, కుంటలు పాడైపోయాయని తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శీతాకాల సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ నగరం పూర్తిగా ఆగమైపోయిందని.. ఉన్న నగరాన్నే సరిగ్గా నిర్వహించలేని ప్రభుత్వం, 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపుతోందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ ఎండగడుతుందని తెలిపారు.



## నేడు అసెంబ్లీకి కేసీఆర్

**హైదరాబాద్, డిసెంబరు 28 :** అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొననున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి నంది నగర్‌లోని తన నివాసానికి ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఇప్పటి వరకు 'సారొస్తారా? అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారా..' అంటూ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలకు గులాబీ పార్టీ బ్రేక్ వేసింది. 'ఔను మా సారొస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారు' అని బీఆర్ఎస్ వర్గాల కథనం. సోమవారం ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశానికి కేసీఆర్ హాజరవుతారని తెలుస్తున్నా.. సమావేశాలు జరిగినన్ని రోజులు పాల్గొంటారా..? ఒక్కరోజుకే పరిమితం అవుతారా..? అన్న విషయమై మాత్రం బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టతనివ్వడం లేదు. ఏది ఏమైనా అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరు కానున్న సమాచారం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 ఎన్నికల్లో అధికారం కోల్పోయాక ఇప్పటి వరకు 2 సార్లు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. ఇటీవల తెలంగాణ భవన్ వేదికగా మీడియాతో కేసీఆర్ మాట్లాడుతూ.. 'ఇయ్యాలటి వరకు ఓ కథ. రేపటి నుంచి మరో కథ. తోలు తీస్తా' అని కాంగ్రెస్ సర్కారుకు ఘాటు హెచ్చరికలు చేశారు. ప్రతిగా అధికార పక్షం విమర్శలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. కృష్ణా జలాల్లో వాటా, పాలమూరు-రంగారెడ్డి పథకంపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం.. దాంతో ఆయా జిల్లాలకు జరిగే నష్టంపై కేసీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి ప్రజల్లోకి వెళ్తారని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడతానన్న వ్యాఖ్యకు కేసీఆర్ కట్టుబడి ఉంటారా..? ఒక్కరోజు మాత్రమే అసెంబ్లీకి హాజరవుతారా? అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# బీఆర్ఎస్ అన్యాయాన్ని ఎండగట్టాలి

**మొదటి పేజీ తరువాయి**

పాటు కృష్ణా జలాలపై ఆయన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడమేగాక.. కాళేశ్వరం ఎత్తిపోతలపై పెట్టినంత శ్రద్ధ దీనిపై పెట్టకపోవడం వల్లే ప్రాజెక్టు పూర్తి కాలేదని సీఎం రేవంత్ చెప్పారు. శ్రీశైలం ఉమ్మడి జలాశయం కావడంతో ఏపీ సమస్యలు సృష్టిస్తోందన్నారు. జూరాల నుంచి చేపట్టి ఉంటే.. ఈ పాటికే నిర్మాణం పూర్తయ్యేదని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం కూడా భారీగా పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 2014కు ముందు చేపట్టిన/ నిర్మాణంలో ఉన్న/ ప్రతిపాదించిన ప్రాజెక్టులకు రక్షణ ఉండేదని, శ్రీశైలం నుంచి ప్రాజెక్టును చేపట్టడం వల్ల చట్టప్రకారం రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి పథకానికి కేటాయించిన 90 టీఎంసీల్లో తొలి దశలో 45 టీఎంసీలతో ప్రాజెక్టు డీపీఆర్‌ను ఆమోదించాలని కేంద్రాన్ని పలుమార్లు కోరామని, ట్రైబ్యునల్ విచారణ ఏడాదిలోపే పూర్తికానందున.. ఆ కేటాయింపులతో కలిపి 90 టీఎంసీలతో రెండోదశను పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయాలనే/పూర్తి కావాలనే ఉద్దేశాలు బీఆర్ఎసకు లేవని, అందుకే ప్రాజెక్టును ఇబ్బంది పెట్టే నిర్ణయాలను అమలు చేస్తోందని ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్లపాటు అధికారంలో ఉండి కూడా కృష్ణాలో పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయకపోయారని ప్రశ్నించారు. 2014లో పెండింగ్‌లో ఉన్న రాజీవ్ బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌కొండ ఎత్తిపోతల పథకాలు.. 2023లో అధికారంలో దిగిపోయే దాకా పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. కాళేశ్వరం



ప్రాజెక్టు హెడ్ వర్క్‌లు పూర్తిచేయడంలో చూపించిన శ్రద్ధ పాలమూరు-రంగారెడ్డిబీ ఇతర ప్రాజెక్టులపై చూపించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన ద్రోహం వల్లే కృష్ణాలో పూర్తిస్థాయిలో నీటి వినియోగం జరగలేదన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఏపీ అక్రమంగా తరలించడానికి, వారు చేపట్టిన అక్రమ ప్రాజెక్టులకు కేసీఆర్ సహకారం ఉందని ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్ల కన్నా ముందే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ అక్రమాలను ఎండగట్టి, ప్రాజెక్టు నిర్మాణంలో ముందుకెళ్లకుండా కట్టడి చేయాల్సి ఉండగా.. బీఆర్ఎస్ మాత్రం ఉద్దేశపూర్వకంగానే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయించిందని ఆక్షేపించారు.

**1న సమగ్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

జనవరి 1న కృష్ణా జలాలపై బీఆర్ఎస్ చేసిన ద్రోహంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, చొరవ ఆధారంగా సమగ్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపొందించి.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కాపీలను తెలుగుతో పాటు ఆంగ్లంలో రూపొందించాలని నిర్దేశించారు.

# ప్రజాస్వామ్యం కోసం పురుడు పోసుకున్న కాంగ్రెస్

## 'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు

దేశ విముక్తి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పురుడు పోసుకున్న భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) 140 ఏళ్ల మైలురాయిని అధిగమించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆనాడు ఇదే రోజు ఒక శక్తిగా ఆవిర్భవించిన కాంగ్రెస్ ప్రస్థానం.. అచ్చంగా భారత ప్రజాస్వామ్య గమనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. సోనియా గాంధీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె రాజకీయ ప్రస్థానంలో సేవ, నిబద్ధత, నైతిక విలువలు అంతర్భాగమని కొనియాడారు. పీవీ, మన్మోహన్‌ల ఎదుగుదల ఆమె ఘనతేనని.. సోనియా తీసుకున్న సాహసోపేత నిర్ణయాల వల్లే దేశానికి గొప్ప నాయకత్వం లభించిందన్నారు. 'తెలంగాణలోని ఒక మారుమూల గ్రామం నుంచి సామాన్య కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టిన పీవీని దేశ ప్రధానిగా చూసే అవకాశం సోనియా నాయకత్వంలోనే సాధ్యమైంది. అలాగే గొప్ప ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్‌ను ప్రధానిని చేసి దేశాభివృద్ధికి కొత్త బాటలు వేశారు' అని పేర్కొన్నారు.

# జీవో 252 సవరణ కోసం
# దశల వారీగా ఆందోళనలు

## రాష్ట్ర కమిటీలో అధ్యక్షులు అల్లం నారాయణ పిలుపు



**యాదగిరిగుట్ట :** అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252పై రాష్ట్రవ్యాప్తంగా టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంత్రులను, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు వినతిపత్రాలు ఇవ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ వివరించారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం టియూడబ్ల్యూజే (హెచ్%-%143) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవో నంబర్ 252పై ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు తెలిపిన నేపథ్యంలో దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా కమిటి నిర్ణయిందన్నారు. ఇందులో భాగంగానే ప్రజా ప్రతినిధులకు మొదటగా వినతి పత్రాలు ఇచ్చి, అసెంబ్లీలో వారు చర్చించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. జీవో 252 కారణంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టాలని నిర్ణయిస్తూ, ప్రభుత్వంతో చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం రావాలని, లేనిపక్షంలో పోరాట మార్గాన్ని అనుసరిస్తామన్నారు. జీవో 252 సవరించేవరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. డెస్క్ జర్నలిస్టులకు రెండు కార్డుల విధానాన్ని తెచ్చి తీరని అన్యాయం చేసిందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పెద్ద పేపర్లతో పాటు మధ్య చిన్న తరహా పత్రికలకు, శాటిలైట్ చానల్స్ కు పెద్ద సంఖ్యలో కార్డులు తగ్గించడం, కేబుల్ చానల్స్ కు రాష్ట్ర స్థాయిలో అసలు కార్డు లేచి లేకుండా చేయడం జీవో ఉద్దేశాన్ని అర్థం చేస్తుందని అన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరిగే ఇలాంటి జీవో సవరణ చేయడం గానీ, నూతన జీవో తీసుకురావడం గాని ఈ ప్రభుత్వం వెంటనే చేయాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది మార్చి నెలలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభ నిర్వహించి పూర్తి స్థాయి కమిటీ వేనున్నట్లు ఆయన వివరించారు. ఆప్పటివరకు మిగిలిన కొన్ని జిల్లాలలో పూర్తిస్థాయి కమిటీ లు వేసుకోవాలని సూచించారు. ఇళ్ల స్థలాల సమస్యపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. చిన్న పత్రికల ఎంప్యానల్మెంట్ సమస్య పరిష్కారం కోసం సమాచార శాఖ భవన్ ముట్టడి కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం 'తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ట్రస్ట్' ప్రారంభించామని ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ మాట్లాడుతూ, జీవో 252ను స్పష్టత లేకుండా జర్నలిస్టు యూనియన్లతో సంప్రదింపులు జరపకుండా విడుదల చేశారని ఆరోపించారు. గతంలో జీవో 239 రూపకల్పన సమయంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాజా జీవో 252లో ఆ స్ఫూర్తి పూర్తిగా లోపించిందన్నారు. ప్రస్తుత నిబంధనల కారణంగా సుమారు 13 వేల అక్రిడేషన్ కార్డులు రద్దయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, ఇది జర్నలిస్టుల వృత్తి భద్రత, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అక్రిడేషన్ కార్డుల దుర్వినియోగంపై కఠిన చర్యలు అవసరమేనని, అయితే అర్హులైన జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని వారు స్పష్టం చేశారు. ప్రధాన జర్నలిస్టు యూనియన్ల అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మీడియా అకాడమీ పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ హాజారీ, కోశాధికారి యోగానంద్, రాష్ట్ర టెంజు అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శి రమణ, ఐజేయూ జాతీయ నాయకులు భాస్కర్, తిరుపతి నాయక్, రాష్ట్ర నాయకులు గొట్టిపర్తి భాస్కర్, గుండు ముత్తయ్యగౌడ్, సుధాకర్, లెనిన్, రాజ్ నారాయణ, రాంగోపాల్, సి హెచ్ .సుధాకర్,నవీన్ కుమార్ యారా తో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జర్నలిస్టులు హాజరయ్యారు..



# కృష్ణా జలాలపై కేసీఆర్ అసత్య ప్రచారం

- ముందు కూతురు కవిత లెక్కలకు సమాధానం చెప్పాలి
- రేవంత్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారు
- నల్లగొండ యువ చైతన్య ర్యాలీలో మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, డిసెంబరు 28 :** కృష్ణా జలాలపై మాజీ సీఎం కేసీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నాడని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఏపీ రాష్ట్ర సీఎం జగన్‌కు వత్తాసు పలికి తెలంగాణకు అన్యాయం చేశాడని మండిపడ్డారు. 24 నెలలుగా ఫాంహౌసకే పరిమితమైన కేసీఆర్‌కు దమ్మొంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేశారు. రెండేళ్ల తర్వాత తమ ప్రభుత్వ లెక్కలు చూస్తానంటున్న కేసీఆర్.. ముందు ఆయన కూతురు కవిత అడిగిన లెక్కలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలో భారీ యువ చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం రెండేళ్లలో పూర్తి చేస్తుందన్నారు. రాష్ట్రంలో మూడేళ్ల తర్వాత మళ్లీ రేవంత్ రెడ్డే సీఎం అవుతారని స్పష్టం చేశారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం త్యాగాలు చేశారని, 3 సార్లు ప్రధాని పదవి చేపట్టే అవకాశం వచ్చినా సోనియా గాంధీ దేశ శ్రేయస్సు కోసం విలువైన సలహాలిచ్చారని కోమటి రెడ్డి చెప్పారు. సోనియాగాంధీ ఆలోచన నుంచి వచ్చిన ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించాలని చూడటం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. కాగా, ఎన్జీ కళాశాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో పాదయాత్రగా మొదలైన ప్రదర్శన.. రామగిరి, బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్ కూడలి వరకూ సాగింది.

# కేసీఆర్‌ది రైతు పాలన.. రేవంత్‌ది రాబంధు పాలన

- కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ ప్రోగ్రెస్ నిల్
- కృష్ణా జలాల విషయంలో బాబు చెప్పినట్టే రేవంత్ ఆడుతున్నడు: కేటీఆర్
- కేసీఆర్‌కు పేరు వస్తుందనే సాగునీటి ప్రాజెక్టులను రేవంత్‌రెడ్డి పండబెట్టిండు
- రైతుబంధు పాలన పోయి తెలంగాణ రాష్ట్రంలో రాబందుల పాలన వచ్చింది
- యూరియా కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి తెచ్చిండ్రు
- నాగర్‌కర్నూల్‌లో సర్పంచ్‌లకు సన్మానం



**మహబూబ్‌నగర్, డిసెంబర్ 28:** పాలమూరుకు అసలు విలన్ కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సమైక్య పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీయే అటకెక్కించిందని, ఇప్పుడు పాలమూరు-రంగారెడ్డి పథకానికి కేసీఆర్ హయాంలో కేటాయించిన 90 టీఎంసీల నీటి కేటాయింపులు కాదని, 45 టీఎంసీలే చాలం టూ ఇక్కడి రైతులకు తీరని ద్రోహం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మాన సభలో కేటీఆర్ మాట్లాడారు.

కేసీఆర్ హయాంలో పాలమూరును సస్యశ్యామలం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి ప్రాజెక్టు పనులను 90 శాతం పూర్తి చేశారని, కాంగ్రెస్ సర్కారు వచ్చి రెండేండ్లయినా మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా ఇప్పుడు మొత్తానికే తొక్కిపెట్టే కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టు మీద పగపట్టిండు.. కాళేశ్వరం మీద కక్ష కట్టిండు.. కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చెప్పినట్టుగా రేవంత్‌రెడ్డి ఆడుతున్నడు' అంటూ విమర్శించారు. పాలమూరును పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే కక్షతోనే ప్రాజెక్టును పక్కనపెట్టారని విమర్శించారు. 'పాలమూరు గోస ఈనాటిది కాదు.. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైనప్పటి నుంచీ మొదలైంది. పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలకు నీళ్లిచ్చేందుకు కృష్ణా నదిపై ప్రాజెక్టులకు ప్రణాళికలు వేసిండ్రు.

ఆలోపే హైదరాబాద్ రాష్ట్రం పోయి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అప్పటి నుంచి ఆంధ్రా పాలకుల నిర్లక్ష్యం, ఈ ప్రాంత నేతలు నోరుమెదపకపోవడంతో పాలమూరులో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని వలసలకు మారుపేరుగా మారింది' అని గుర్తుచేశారు. 1956 నుంచి 2001 దాకా పాలమూరులో ఏ ఒక్క ప్రాజెక్టునూ కాంగ్రెస్ పట్టించుకోలేదని, పాలమూరుకు నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్సేనని స్పష్టంచేశారు. పాలమూరు గోస తీర్చేందుకు కేసీఆర్ హయాంలో 90 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తొక్కిపెట్టాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండేండ్లలో కాంగ్రెస్ సర్కార్‌కు కనీసం కాలువలు తవ్వడం కూడా చేతకాలేదని మండిపడ్డారు.

### రైతుబంధు పోయి రాబందు పాలన

రాష్ట్రంలో రైతుబంధు పాలన పోయి.. రాబందుల పాలన వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణలో రైతుల పరిస్థితి చూస్తే బాధకలుగుతున్నదని, యూరియా కోసం అన్నదాతలు అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితికి ఈ ప్రభుత్వం దిగజార్చిందని మండిపడ్డారు. చలిలో గంటల తరబడి లైన్‌లో నిలబడే పరిస్థితి మళ్లీ వచ్చిందని వాపోయారు. 'ఆనాటి రోజులు తెస్తామంటే ఏదో అనుకున్నం.. నిజంగానే పాత రోజులు వచ్చినయ్. ఎరువుల కోసం లైన్‌లో చెప్పులు కనబడుతున్నయ్. యూరి యా దుకాణాల వద్ద రైతుల బారులు కనబడుతున్నయ్' అని దుయ్యబట్టారు.

నేటి పాలకుల గుండెల్లో రైతులపై ప్రేమ లేదని, అందుకే రైతులకు ఈ దుస్థితి వచ్చిందని ఫైర్ అయ్యారు. మార్పు అంటూ ఊదరగొట్టి గద్దెనెక్కి తెలంగాణను ఆగమాగం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రేవంత్‌రెడ్డికి పాలమూరు మీద ప్రేమ లేదు.. హామీల అమలుపై చిత్తశుద్ధి లేదు.. ఆయనకు భూముల మీద.. భూ దందాల మీద.. భూ కబ్జాల మీద.. వాటి నుంచి వచ్చే రియల్ ఎస్టేట్ పైసల మీద తప్ప.. ప్రజల మీద ప్రేమ లేదు' అని ధ్వజమెత్తారు. 'రెండేండ్లయినా గ్యారెంటీలు అమలు చేయడం లేదని అడిగితే 'గుడ్లు పీకి గోటీలాడతా.. పేగులు తీసి మెడలో వేసుకుంటా.. లాగుల తొండలు ఇడుస్తా' అంటూ బూతులు మాట్లాడుడు తప్ప చేసిందేం లేదు' అని దెప్పిపొడిచారు.

### భూముల అమ్మకంపైనే రేవంత్ ధ్యాస

హైదరాబాద్‌లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను అమ్మేందుకు హిల్ట్ స్కీం తెచ్చి రూ.5 లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించాడని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ధ్యాస అంతా భూముల అమ్మకంపైనే ఉన్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఎంత దోపిడీ చేసినా.. ఎన్ని కుంభకోణాలకు పాల్పడినా బీజేపీ మాత్రం మాట్లాడదని, కాంగ్రెస్, బీజేపీ నడుమ అలయ్ బలయ్ నడుస్తున్నదని విమర్శించారు.

### ప్రజలు కేసీఆరే కావాలంటున్నరు

రెండేండ్లలోనే కాంగ్రెస్ సర్కారు తీరు ప్రజలకు అర్థమైందని, అడ్డగోలు హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయని ప్రభుత్వంపై మండి పడుతున్నారని, ఏదో మార్పు అని ఓటేసినందుకు మోస పోయి గోస పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎట్లుండె? ఇప్పుడెట్లున్నది? అని ఆలోచిస్తున్నారని, పాలిచ్చే బర్రెను కాదనుకొని తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని బాధపడుతున్నారని తెలిపారు. 'కేసీఆర్ ఉన్నప్పుడు ఉత్తమ పంచాయతీల అవార్డుల్లో తెలంగాణకు 30 శాతం వచ్చినయ్ .. కాంగ్రెస్ వచ్చినంక ఏమైంది? ట్రాక్టర్లతో డీజిల్ పోసే దిక్కు లేదు. దంపు యార్డులను, వైకుంఠధామాలను పట్టించుకునేటోడు లేడు. మొత్తం కంప చెట్లు పెరిగి ఊర్లన్నీ ఆగమాగమైనయ్' అని వాపోయారు.

### సర్పంచ్‌ల మీటింగ్‌లో బూతు పురాణమా?

'మొన్న కోస్గిలో సీఎం రేవంత్‌రెడ్డి మీటింగ్ పెట్టి సర్పంచ్‌లకు నాలుగు మంచి మాటలు ఏమైనా చెప్తాడేమో అనుకున్నా.. ఏం మాటలవి? బూతులే బూతులు.. నేను ఆంధ్రాలో చదువుడు ఆయనకు నచ్చలేదట.. అవును మరి.. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు.. 1991లో తెలంగాణలో ఈ దిక్కుమాలిన కాంగ్రెస్ గవర్నమెంట్.. బడులను సక్కగ పెట్టక.. కాలేజీలు సక్కగా పెట్టక నాలాంటోళ్లు లక్షల మంది ఆంధ్రాకు పోయి చదువుకున్నరు' అని ధ్వజమెత్తారు.

'కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి కానియ్య అని శపథం చేస్తున్నవ్.. రేవంత్‌రెడ్డీ.. దమ్మొంటే రైతులకు యూరియా కష్టాలు లేకుండా చేస్తానని శపథం చెయ్.. మహిళలందరికీ నెలకు రూ.2,500 జనవరి 1 కానుకగా ఇస్తానని శపథం చెయ్.. సంక్రాంతి నుంచి తులం బంగారం ఇస్తానని శపథం చెయ్.. ముసలోళ్లకు రూ.4వేలు పెన్షన్ ఇస్తానని శపథం చెయ్' అని సవాల్ విసిరారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని అప్పగిస్తే కాంగ్రెస్ నాయకులు తెలంగాణను ఆగం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

### వాళ్ల కండ్లు నెత్తికెక్కినయ్

'ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నరు.. ఎంపీ ఉన్నడు.. ముఖ్యమంత్రిది కూడా ఈ జిల్లానే.. అధికారం, హంగు, ఆర్భాటం అన్నీ ఉన్నయి. వాళ్ల కండ్లు నెత్తికెక్కినయ్. ఎవరైనా బీఆర్ఎస్ సర్పంచులు వస్తే గేట్ కాడి నుంచే మెడబట్టి నూకుతా అని బెదిరిస్తున్నరు. నేనొక్కటే మాట చెప్తున్నా.. సర్పంచులు ఎవరికీ భయపడొద్దు. భారత రాజ్యాంగం మీకు రక్షణగా ఉన్నది. పంచాయతీలకు వచ్చే నిధులను ఆపే హక్కు ఏ ఎమ్మెల్యేకు లేదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు. 'కాంగ్రెస్ వాళ్ల కథ రెండేండ్లే.. ఆ తర్వాత నెక్స్ట్ అధికారం మనదే.. బీఆర్ఎస్ వచ్చాక మీరు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత మాదే' అని భరోసా ఇచ్చారు. సర్పంచ్‌గా గెలిచిన, గెలిపించిన వారందరికీ అభినందనలు తెలిపారు.

### మొన్నటిది క్వార్టర్ ఫైనలే

'మొన్నటి సర్పంచ్ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమే..ఇప్పుడు ముందట సెమీ ఫైనల్ ఉన్నది.. మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికలు వస్తయి.. అటెన్క కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు 2028లో ఫైనల్ ఉంటది. పోయిన ఎన్నికల్లో చేసిన తప్పు మళ్లీ చేయొద్దు.. కారు గుర్తు మీద ఎవరు నిలబడ్డా.. కేసీఆరే నిలబడినట్టు భావించి గెలిపించాలె' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇంతియాజ్ ఇసాక్, నాయకులు కురువ విజయ్ కుమార్, బైకని శ్రీనివాస్ యాదవ్, కురువ పల్లయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



# జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణం

**డైవ్లో సార్టీలో అబ్దుల్ కలాం తర్వాత పాల్గొన్న రెండో రాష్ట్రపతిగా రికార్డు**

**కార్వార్ నౌకాస్థావరం నుంచి ఐఎన్ఎస్ వాఘ్షీర్లో సాహసయాత్ర**

**బెంగళూరు :** త్రివిధ దళాధిపతి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించి చరిత్ర సృష్టించారు. ఇటీవలే యుద్ధ విమానంలో ప్రయాణించిన రాష్ట్రపతి ఆదివారం ఉత్తర కర్ణాటక జిల్లా కారవార నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్లో సాహస యాత్ర చేశారు. ఈ క్రమంలో జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా రికార్డు సృష్టించారు. 2006 ఫిబ్రవరిలో.. అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం కూడా కల్వరి శ్రేణి జలాంతర్గామిలో ప్రయాణించారు. నౌకాదళ యూనిఫాం ధరించిన రాష్ట్రపతి ముర్ము.. ఐఎన్ఎస్ వాఘ్షీర్తో సముద్రంలోపల గంటకుపైగా ప్రయాణించారు. నేవీ బృందాల కార్యాచరణ, జలాంతర్గామి సాంకేతిక సామర్థ్యం గురించి ఆరా తీశారు. ఐఎన్ఎస్ వాఘ్షీర్ను ఈ ఏడాది జనవరిలో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. తక్కువ శబ్దం చేస్తూ సముద్ర గర్భంలో కదిలే ఈ జలాంతర్గామి శత్రు రాడార్లకు చిక్కకుండా నిఘా పెడుతుంది. అందుకే దీన్ని సైలెంట్ హంటర్ అని కూడా పిలుస్తారు.

## ప్రతిఫలం కాంక్షించి చేస్తే సేవ కాదు

**బలవంతంగా చేసే పని సేవ అనిపించుకోదు**

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మెహన్ భాగవత్ వ్యాఖ్యలు**

**కన్హా శాంతివనంలో ముగిసిన విశ్వ సంఘ్ శిబిరం**

**హైదరాబాద్ :** ప్రతిఫలం కాంక్షించి చేసే పనిని సేవ అనరాదని, బలవంతంగా చేసే పని సేవ అనిపించుకోదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ చెప్పారు. పేరును ఆశించి ఇతరులకు చూపించడానికి సేవ చేయడం అహంకారమని, సేవ చ్టేస వారు కేవలం్టసవ కోసమ్టేసవా కార్యక్రమం చేస్తారన్నారు. సవ ఓ పవిత్ర కర్తవ్యమని, నిస్వార్థంగా, ఏమీ ఆశించకుండా సేవ చేసేవారే స్వయం సవకులని ఆయన చెప్పారు. షాద్ నగర్ సమీపంలోని కన్హా శాంతివనంలో 5రోజుల పాటు జరిగిన 7వ విశ్వ సంఘ్ శిబిరం ప్రపంచ స్థాయి సమ్మేళనంలో 79 దేశాల నుంచి వచ్చిన 1610 మంది కార్యకర్తలు, స్వయం సేవకుల ప్రతినిధులు పాల్గొన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా మెహన్ భాగవత్ ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్్టసవా తత్పరతతో పనిచేసే సంఘ స్వయం్టసవకులను తయారు చేశారని ఆయన గుర్తు చేశారు. శివజ్ఞానే జీవ్టసవ అంటూ రామకృష్ణ పరమహంస్టసవకు అర్థాన్ని నిర్వచించారని భాగవత్ చెప్పారు. ఐదేళ్లకోసారి వరదలా వచ్చి ఇంటింటికీ తిరుగుతూ తమకు సేవ చ్టేస అవకాశం కల్పించాలంటూ ప్రజలను ప్రార్థించి మళ్లీ ఐదేళ్ల దాకా కనిపించరంటూ ఆయన కొందరు రాజకీయ నేతలను ఎద్దేవా చేశారు. స్వయం సవకులు విదేశాలకు వెళ్లినా హిందూ ధర్మ సంరక్షణను మరిచిపోలేదని భాగవత్ గుర్తు చేశారు. విదేశాల్లో ఉన్న వారంతా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాన్ని, ఆచరణ పద్ధతులను చూసి, ఎలా జీవించాలో నేర్చుకోవాలన్నారు. మనం ఎలా బతకాలో పూర్వీకులు నిర్దేశించార ని అలాంటి ఉదాహరణను ప్రపంచం ముందుంచి, ప్రతి చోటా ధర్మాన్ని ప్రతిష్ఠ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మన సైనిక శక్తిని ప్రదర్శించో, మన ఆర్థిక వ్యవస్థ ద్వారా ఇతరులను అణగదొక్కో ఎదగాలని భావించమన్నారు. మన జీవన పద్ధతుల ద్వారానే నేతృత్వం వహిస్తూ మన జీవన పద్ధతులను ప్రపంచం ముందు వుంచుతామని భాగవత్ చెప్పారు.

## యూపీలో 2.89 కోట్ల ఓటర్ల పేర్లు తొలగింపు

**లఖ్‌నవూ :** ఉత్తరప్రదేశ్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో భాగంగా 2.89 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల కమిషన్ తొలగించింది. 12.55 కోట్ల మంది పేర్లు జాబితాలో ఉండనున్నాయి. బుధవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, గురువారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రణదీప్ రిన్వా చెప్పారు. అభ్యంతరాలు తెలిపేందుకు నెల రోజుల సమయం ఉందని, పేర్లు లేని వారు ఫారం-7 ద్వారా వివరాలు తెలపాల్సి ఉంటుందని తెలిపారు. మరణాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం వంటి కారణాలతో జాబితాల నుంచి పేర్లు తొలగించినట్టు చెప్పారు. ఓటర్లుగా నమోదుకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఇచ్చిన ఫారాలను 8 లక్షల మంది తిరిగి ఇవ్వలేదని తెలిపారు. వాటిని సమర్పించాలని తాము ఒత్తిడి చేయబోమని అన్నారు.

## దిగ్విజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో రచ్చ

**న్యూఢిల్లీ :** ఆర్ఎస్ఎస్‌ను, ప్రధాని మోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ పెట్టిన పోస్టు ఆ పార్టీలో కలకలం రేపుతోంది. పలువురు నాయకులు ఆయన తీరును ఆదివారం తీవ్రంగా తప్పుబట్టారు. 'ఆర్ఎస్ఎస్ విద్వేషంపై నిర్మితమైంది. విద్వేషం నుంచి నేర్చుకోవలసింది ఏమీ లేదు. అల్-ఖైదా నుంచి ఏమైనా నేర్చుకోగలమా' అని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ 'ఎక్స్'లో నిలదీశారు. 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ యువరక్తంతో ఉందని.. విద్వేషంపై పోరాడుతోందని తెలిపారు. ఏఐసీసీ మీడియా-పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేరా కూడా దిగ్విజయ్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'గాడ్సేకు సంబంధించిన సంస్థ నుంచి గాంధీజీ నడిపిన కాంగ్రెస్ ఏం నేర్చుకోవాలి' అని ప్రశ్నించారు. సొంత పార్టీ నేతలు తనపై విరుచుకుపడడంతో దిగ్విజయ్ ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు. 'సంఘ్ సిద్ధాంతాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. అది ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని గానీ, మన చట్టాలను గౌరవించదు. కానీ దాని సంస్థాగత సామర్థ్యాన్ని అభిమానిస్తాను' అని స్పష్టం చేశారు. 'సంఘ్‌ను ప్రశంసిస్తూ పోస్టు చేస్తే ఎందుకింత గగ్గోలు తలెత్తిందో తెలియదు. బీజేపీ అగ్ర నేత ఆడ్వాణీ కాళ్ల వద్ద మోదీ కూర్చున్న ఫొటో 'కోరా'లో నాకు కనబడింది. చాలా బాగుందనిపించింది. ఆ తర్వాత ఆయన సీఎం అయ్యారు. ప్రధాని అయ్యారు. అది ఆర్ఎస్ఎస్ బలం వల్లే. లేదంటే మోదీకి అంత సత్తా ఎక్కడుంది' అని ప్రశ్నించారు. రాహుల్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నారని, డీసీసీలన నియమించారని గుర్తు చేశారు. దిగ్విజయ్ పోస్టును కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ సమర్థించారు. కాంగ్రెసను సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం ఆత్మశోధన అవసరమని అభిప్రాయపడ్డారు. అయితే రాజకీయ విజయాలకు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. సంస్థాగత సంస్కరణలను తాను కూడా కోరుకుంటున్నానని చెప్పారు.

# ఈ ఏడాది భారత్‌కు గర్వకారణం

**ఆపరేషన్ సిందూర్ నుంచి ప్రపంచ కప్ వరకూ**

**2025లో ఎన్నో మైలురాళ్లు అధిగమించాం**

**ప్రతిచోటా భారత దేశ ప్రభావం స్పష్టం**

**కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి**

**ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్'లో మోదీ**



**న్యూఢిల్లీ:** భారత్ గర్వించదగిన, చిరస్మరణీయమైన ఎన్నో మైలురాళ్లను 2025 అందించిందని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్' 129వ ఎపిసోడ్‌లో ఆయా కీలక ఘట్టాలను ఆయన గుర్తుచేసుకున్నారు. జాతీయ భద్రత, క్రీడలు, సాంకేతిక ఆవిష్కరణలతో పాటు ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై ఈ ఏడాది భారతదేశం ప్రభావం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ప్రతి భారతీయుడికి గర్వకారణమైన ఆపరేషన్ సిందూర్... భద్రత విషయంలో దేశం రాజీ పడదని ప్రపంచానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. జాతీయ గేయమైన వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా ఇదే స్ఫూర్తి కనిపించిందని చెప్పారు. పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని, మహిళల క్రికెట్ జట్టు తొలిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకొని క్రీడల పరంగా ఈ ఏడాదిని చిరస్మరణీయంగా మార్చాయని అన్నారు. అంతేకాకుండా, మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను సాధించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఆసియా కప్ టీ20లో అద్భుతమైన విజయం సాధించిన తర్వాత త్రివర్ణ పతాకం గర్వంగా రెపరెపలాడిందని, పారా అథ్లెట్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతాకల పంట పండించారని మోదీ కొనియాడారు. సైన్స్, అంతరిక్ష రంగాల్లోనూ భారత్ గొప్ప ముందడుగు వేసిందని, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా నిలిచారని పేర్కొన్నారు. ఈ ఏడాది దేశంలోని చిరుతపులుల సంఖ్య 30కి పైగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా 2025లో జరిగిన వివిధ కార్యక్రమాలను మోదీ ప్రస్తావించారు. మన సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీకగా ఏడాది ప్రారంభంలో ప్రయాగరాజ్‌లో నిర్వహించిన మహా కుంభమేళా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని అన్నారు. అయోధ్య రామమందిరంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందన్నారు. "2025 భారత్‌కు మరింత ఎక్కువ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. సరికొత్త ఆశలు, సంకల్పాలతో నూతన సంవత్సరం 2026లో ముందుకు సాగడానికి దేశం సిద్ధంగా ఉంది' అని మోదీ అన్నారు.

**భారత్‌వైపు ఆశగా చూస్తున్న ప్రపంచం**

ప్రపంచం మొత్తం ఈ రోజు భారత్‌వైపు ఎంతో ఆశగా చూస్తోందని, దేశంలోని యువ శక్తే దీనికి అతిపెద్ద కారణమని మోదీ అభివర్ణించారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంతో పాటు 'యంగ్ లీడర్స్ డైలాగ్'ను నిర్వహిస్తామని, అందులో తాను కూడా తప్పనిసరిగా పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవిష్కరణలు, ఫిట్‌నెస్, స్టార్టప్‌లు, వ్యవసాయం తదితర కీలక అంశాలపై యువత తమ ఆలోచనలు పంచుకుంటారని వెల్లడించారు. భారతీయ సంస్కృతి, భాషలను విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా కొత్త తరాన్ని తమిళ భాషతో అనుసంధానించడానికి ఫిజీలో జరుగుతున్న ప్రయత్నాలను ప్రశంసించారు. కాగా, యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వాడకంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి ఇష్టానుసారంగా తీసుకొనేవి కావని, డాక్టర్ సలహా మేరకే వాడాలని ప్రజలను కోరారు.

**లేస్ పరిశ్రమకు కేరాఫ్ నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్దనున్న సీతారాంపురం గ్రామం లేస్ పరిశ్రమకు కేరాఫ్‌గా నిలుస్తోంది. దాదాపు 160 ఏళ్ల క్రితం ఐర్లాండ్ దేశస్థులు వ్యాపారం నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడి మహిళలకు లేసు అల్లికలపై శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు అల్లికలను విదేశాలకు ఎగుమతి చేశారు. ఇలా మొదలైన లేస్ పరిశ్రమ 2010కల్లా వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ఏటా రూ.150 కోట్ల ఎగుమతులు జరిగేవి. 2010లో ప్రభుత్వం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో లేస్ పార్కును ఏర్పాటుచేసి మహిళలకు అల్లికల్లో ఆధునిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించడం మరింత గుర్తింపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే నరసాపురం లేస్ క్రాఫ్ట్ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని మోదీ ప్రశంసించారు.

**దుబాయ్‌లో కన్నడ పాఠశాలపై ప్రధాని ప్రశంస**

దుబాయ్‌లో కన్నడ పాఠశాల ఏర్పాటు పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు అందజేశారు. ప్రవాస కన్నడిగుల కోసం కన్నడ పాఠశాల కొనసాగించడం సంతోషకరమన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో భాగంగా కన్నడిగుల భాషాభిమానాన్ని ప్రధాని కొనియాడారు. దుబాయ్‌లో నివసించే కన్నడిగులు కన్నడ భాషను మరువరాదని ఓ ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేశారని, పిల్లలకు కన్నడ రాయడం, చదవడం, మాట్లాడడం నేర్పుతున్నారని,. సుమారు వెయ్యిమంది పిల్లలకు కన్నడ భాష నేర్పించే ప్రక్రియ జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

# ఏప్రిల్ నుంచి జీరామ్‌జీ!

**పాత 'ఉపాధి' చట్టం కటాఫ్ తేదీపై త్వరలోనే కేంద్రం నోటిఫికేషన్**

**చట్టం అమలుకు రాష్ట్రాలు బిల్లు ఆమోదించుకోవాలి.. 40% వాటా భరించాల్సి రావడమే కారణం**

**వీబీ జీరామ్‌జీపై ప్రతిపక్షాల పోరు ఫలిస్తుందా?.. కేంద్రం వెనక్కి తగ్గుతుందా.. లేక ముందుకేనా?**

**కొత్త పథకంలో ఇప్పటి జోరుతో పనులు సాగేనా?.. రాష్ట్రాలను, లబ్ధిదారులను వేధిస్తున్న ప్రశ్నలెన్నో!**

**న్యూఢిల్లీ :** దేశంలో పేదలకు ఉపాధి హామీకి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తెచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీరామ్‌జీ)' 2026 ఏప్రిల్ నుంచే అమల్లోకి రానుంది. దీనిపై త్వరలోనే కేంద్రం నుంచి ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవలే పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ చట్టంలో.. రాష్ట్రాలు ఆరునెలల్లోపు దీని అమలుకు అనుగుణంగా విధివిధానాలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. కానీ పాత ఉపాధి హామీ పథకం కింద పనులను ఎప్పటివరకు కొనసాగించవచ్చు? కొత్త నిబంధనల మేరకు పనులు ఎప్పటి నుంచి చేపట్టాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పాతచట్టం కింద పనులను నిలిపేయాల్సిన తేదీ 2026 మార్చి 31గా ఉండవచ్చని పేర్కొంటున్నాయి. ఆ తర్వాత కొత్త వీబీ-జీరామ్ జీ నిబంధనల ప్రకారమే పనులు జరగాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి.

**వ్యతిరేకిస్తున్నా.. ముందుకు వెళ్లాల్సిందేనా?**

వీబీ జీరామ్‌జీ చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వాలు 40శాతం వాటాను భరించాల్సి ఉంటుంది. దీనిని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాలు పోరాటం కూడా మొదలుపెట్టాయి. అయితే రాష్ట్రాలు తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే.. కొత్త చట్టం అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడం అనివార్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త చట్టం ఆధారంగా రాష్ట్రంలో అమలుచేసే పథకం, విధి విధానాలు, నిధుల కేటాయింపు తదితర అంశాలతో బిల్లును శాసనసభలో పెట్టి ఆమోదించుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్త చట్టంతో ఉపాధి వేతన నిధుల్లో 40శాతం భరించాల్సి రావడంతో.. రాష్ట్రాలు ఇంతకుముందులా ఉత్సాహంగా పనులు చేస్తాయా? అందుకు ఎన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి సహకరిస్తుంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం కోసం ఖర్చు చేసే మొత్తం, ఉపాధి కల్పించే రోజులు, జరిగే పనులు తగ్గిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధి హామీతో కూలీలకు డిమాండ్ పెరిగి.. పురుషులు, మహిళలకు సమాన వేతనం అందే పరిస్థితి ఏర్పడింది. కొత్త చట్టం వల్ల పనిదినాలు తగ్గిపోతే.. మహిళలకు వేతనాల విషయంలో వ్యత్యాసం పెరిగే ప్రమాదమూ ఉందన్న అభిప్రాయం వస్తోంది.

**ఉప్పెనలా పాత 'ఉపాధి'.. 266రకాల పనులు**

ప్రస్తుతం అమల్లో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో పనులు ఉప్పెనలా సాగాయి. కచ్చితమైన పరిమితేమీ లేకుండా అవసరమైన వారందరికీ పని కల్పించాల్సి రావడం, వారికి ఇచ్చే వేతనాల్లో 90శాతం కేంద్రమే భరించడంతో రాష్ట్రాలు ఈ పథకం అమల్లో పోటీపడ్డాయి. ఆ చట్టం కింద తొలుత అనుమతించిన పనులేకాకుండా.. పథకానికి అనుసంధానంగా ఉండేలా పలు కొత్త పథకాలు, పనులను రూపొందించుకున్నాయి. ఉదాహరణకు ఉపాధి హామీ పథకం ప్రారంభంలో నీటి నిర్వహణ పనులు ప్రభుత్వ, అటవీ, సామాజిక భూములకే పరిమితం. తర్వాత క్రమంగా చిన్న, సన్నకారు రైతుల భూముల్లో ఫారం పాండ్ల నిర్మాణం, భూమి చదును కార్యక్రమం, గట్ల నిర్మాణం వంటి పనులనూ చేర్చారు. ఉపాధి హామీతో అనుసంధానం చేసుకుని రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకానికి ఉద్యానవన శాఖ ఒక పథకం ప్రారంభించింది. ఇక తొలుత గ్రామీణ లింకురోడ్లకు మాత్రమే ఉపాధి హామీలో అనుమతి ఉంటే క్రమంగా సిమెంటు రోడ్లకు కూడా అనుమతి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానం చేసింది. గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా సమాఖ్యల భవనాలను కూడా ఉపాధి హామీతో అనుసంధానం చేసుకుని, నిర్మించేలా ఏర్పాట్లు చేసింది. ఇలా రాష్ట్రంలో సుమారు 266 రకాల పనులు ఉపాధి హామీకి అనుసంధానమై ఉన్నాయి. కొత్త చట్టంతో అవన్నీ నీరసపడే అవకాశం కనిపిస్తోంది.

**90శాతం సొమ్ము మళ్లీ ఆర్థిక వ్యవస్థలోకే..**

పాత ఉపాధి హామీ (ఎంజీ నరేగా) పనుల్లో కొంత అవినీతి జరుగుతుందని.. పూడిక తీసిన చెరువులోనే మళ్లీ పూడిక తీస్తున్నారని, పనుల్లో నాణ్యత ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో అనేక చర్చలు జరిగాయి. ఒకసారి కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా - ఇది పంచాయతీరాజ్



పాలనపై శిక్షణ ఇచ్చే కేరళ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ) చర్చలో.. సరైన పనులపై వ్యయం జరగడం లేదని, నాణ్యమైన మౌలిక వసతుల కల్పన జరగడం లేదనే ప్రస్తావన వచ్చింది. దీనికి అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి, తన పదవీకాలం మొత్తం గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్ శాఖల్లోనే పనిచేసిన ఐఏఎస్ అధికారి ఎస్.ఎం.విజయానంద్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. "ఉపాధి హామీ పథకం నిధుల్లో అత్యధికం చెల్లించేది వేతనాల కిందే. ఆ మొత్తం వెళ్లేది గ్రామాల్లోకే. వాళ్లేమీ ఆ డబ్బును ఇళ్లలో దాచిపెట్టుకోరు. 90శాతం సొమ్మును బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు కొనుగోలు చేస్తారు. అంటే ఆ 90శాతం సొమ్ము తిరిగి ఆర్థిక వ్యవస్థలోకి వచ్చేస్తుంది. పారిశ్రామిక రంగం, సేవల రంగం పనిచేయడానికి.. మొత్తంగా ఆర్థిక రంగం మందగమనంలోకి వెళ్లకుండా ఇది ఉపకరిస్తుంది" అని విజయానంద్ చెప్పడం గమనార్హం.

**తెలంగాణలో అనేక లక్ష్యాల సాధనకు ఉపాధి ఊతం.. మరి ఇకపై?**

ఉపాధి హామీ పథకంలో నాణ్యమైన పనులు కూడా చాలా జరిగాయి. తెలంగాణ రాష్ట్రాన్నే తీసుకుంటే దాదాపు అన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేశారు. 100శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యాన్ని సాధించగలిగారు. అన్ని గ్రామాల్లోని చెరువుల్లోను పూడిక తీశారు. అప్పటివరకు కబ్జా కోరల్లోకి వెళ్లిన చెరువులు.. ఆ సమస్య నుంచి బయటపడేందుకూ ఇది తోడ్పడింది. చాలా గ్రామాల్లో చెరువు గట్లపై కొబ్బరి, ఇతర పండ్ల మొక్కలు కనిపిస్తున్నా.. ఉమ్మడి వరంగల్ జిల్లా అక్కపల్లిగూడెం వంటి పంచాయతీలో 50 ఏళ్లు సాగులో లేని భూములను చదునుచేసి ఇప్పుడు సాగులోకి తెచ్చుకున్నా.. ఉపాధి హామీ పథకమే కారణం. వీబీ జీరామ్‌జీ చట్టంలో కూడా గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నీటి నిర్వహణ పనులు, జీవనోపాధి పెంపు తదితర పనులు చేపట్టవచ్చని పేర్కొన్నారు. కానీ అవి ఇప్పటివరకు జరిగిన స్థాయిలో ఉంటాయా అన్నది ప్రశ్నార్థకమే.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్కాలర్‌షిప్స్ గురించి మీకు తెలుసా?



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన సామాజిక బాధ్యతలను ప్రతిబింబిస్తూ చదువులో మెరిట్ ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం, వికలాంగులకు మద్దతు ఇవ్వడం, గ్రామాలను దత్తత తీసుకోవడం వంటి కార్యక్రమాల చేస్తుందని మీకు తెలుసా.. ఈ విధంగా ఎస్‌బీఐ దేశ నిర్మాణంలో తన పాత్రను నెరవేరుస్తోంది.

ఎస్‌బీఐ ప్రముఖ స్కాలర్‌షిప్ పథకం ఎస్‌బీఐ ప్లాటినం జూబిలీ ఆశా స్కాలర్‌షిప్ (SBI Platinum Jubilee Asha Scholarship) లేదా ఎస్‌బీఐ ఆశా స్కాలర్‌షిప్ ప్రోగ్రాం. ఇది మెరిటోరియస్ (మెరిట్ ఉన్న) ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అందించే పథకం. దీనిని ఎస్‌బీఐ ఫౌండేషన్ నిర్వహిస్తుంది. దేశంలో ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చే మెరిట్ విద్యార్థులకు విద్యను కొనసాగించేందుకు దీనిని ఉద్దేశించారు. ప్రతి ఏటా సుమారు 23,230 మంది విద్యార్థులకు దాదాపు రూ.90 కోట్లు స్కాలర్ షిప్స్ కింద ఖర్చుచేస్తున్నారు.

ఎస్‌బీఐ ప్లాటినం జూబిలీ ఆశా స్కాలర్‌షిప్ ప్రతీ ఏటా (అన్నువల్‌గా) అందిస్తారు. ఇది ఒక్కసారి మాత్రమే ఇచ్చే స్కాలర్‌షిప్ కాదు. స్కాలర్‌షిప్ రెన్యూవల్ ప్రతీ సంవత్సరం జరుగుతుంది. విద్యార్థి మినిమమ్ ఎలిజిబిలిటీ క్రైటీరియా (ఉదా: 75 శాతం మార్కులు లేదా 7 CGPA, కుటుంబ ఆదాయ లిమిట్) నిర్వహిస్తే, కోర్సు పూర్తి అయ్యే వరకు ప్రతీ ఏటా స్కాలర్‌షిప్ కొనసాగుతుంది.

**స్కాలర్‌షిప్ వివరాలు:**

స్కూల్ స్టూడెంట్స్ (క్లాస్ 9 నుంచి 12): రూ. 15,000 నుంచి రూ. 50,000 వరకు పర్ ఇయర్

అండర్ గ్రాడ్యుయేట్ (UG): రూ. 75,000 నుంచి ఆ చదువును బట్టి..

పోస్ట్ గ్రాడ్యుయేట్ (PG), IITలు, IIMలు, ఓవర్సీస్ స్టడీస్ విద్యార్థులకు: రూ. 20 లక్షల వరకు (కోర్సు ఫీజు ఆధారంగా).

**అర్హతలు:**

భారతీయ పౌరులు అయి ఉండాలి

కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 3 లక్షల నుంచి రూ. 6 నుంచి 8 లక్షల లోపు ఉండాలి (పథకం ఆధారంగా మారవచ్చు)

**మెరిట్:**



మునుపటి పరీక్షల్లో 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలి

**వర్తింపు:**

క్లాస్ 9 నుంచి 12, UG, PG, మెడికల్, IIT/IIM, ఓవర్సీస్ స్టడీస్ వరకు

కొన్ని కేటగిరీల్లో SC/ST, గర్ల్స్‌కు రిజర్వేషన్ (50 శాతం)

ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ ఉండటం తప్పనిసరి (కొన్ని పథకాల్లో)

**అప్లికేషన్ ప్రాసెస్:**

ఆన్‌లైన్‌లో మాత్రమే అప్లై చేయాలి.

అధికారిక వెబ్‌సైట్: https://www.sbiashaschol-arship.co.in/ లేదా https://sbifoundation.in ద్వారా (లేదా Buddy4Study పోర్టల్ ద్వారా).

దరఖాస్తు చేసేటప్పుడు మార్క్‌షీట్లు, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ డీటెయిల్స్ అప్‌లోడ్ చేయాలి.

మరిన్ని వివరాలకు అధికారిక సైట్ సందర్శించండి లేదా ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సంప్రదించండి.

# స్కిల్ గ్యాప్‌ని తగ్గించే సీడాక్ కోర్సులు



డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ దిశగా భారతదేశం దూసుకెళుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సెమికండక్టర్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా నిర్దేశిత టెక్నాలజీలు వేగంగా పుంజుకుంటున్న రోజులు ఇవి. మిలియన్ల కొద్దీ ఉద్యోగ అవకాశాలను ఈ పరిణామాలు కల్పిస్తున్నాయి. అదే సమయంలో సరికొత్త సవాళ్ళనూ విసురుతున్నాయి. అయితే ఈ క్రమంలో ఇండస్ట్రీ కోరుకుంటున్న నైపుణ్యాలు కలిగిన యువత మాత్రం లభ్యం కావటం లేదు. ఫలితంగా అటు అవసరాలు, ఇటు నైపుణ్యం కలిగిన మానవవనరుల మధ్య అంతరం పెరుగుతోంది.

మన దేశంలో ఏటా లక్షన్నరకు మించి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వివిధ సంస్థల నుంచి ఉత్తీర్ణులవుతున్నారు. అయితే అందులో పరిశ్రమకు అచ్చంగా ఉపయోగపడే నైపుణ్యాలు కలిగిన వారు మాత్రం తక్కువ శాతంగానే ఉంటున్నారు. దాంతో ఆ గ్రాడ్యుయేట్లు ఉద్యోగం కోసం ప్రయాసపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలాఉంటే టెక్నాలజీపరంగా అత్యున్నత ఎదుగుదల ఉన్న డొమైన్లు పలు సాంకేతిక పరిజ్ఞాన రంగాల కలయికగా మారి పటిష్టమైన కెరీర్ డ్రైవర్లుగా మారుతున్నాయి. వాటిలో ముఖ్యంగా....

**అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్:**

నేషనల్ కంప్యూటింగ్ మిషన్ వంటివి కంప్యూటింగ్ అత్యున్నత ప్రతిభ కలిగిన వారిని డిమాండ్ చేస్తున్నాయి. దానికితోడు ఏఐ ఇంటిగ్రేషన్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, డేటా ఇంజనీరింగ్, ఎన్శరట్రప్రైజ్ వెబ్ అప్లికేషన్ డెవల్‌పమెంట్‌ను డిమాండ్ చేస్తోంది.

**ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్**


వీఎల్ఎసఐ: సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్ కింద మన దేశం అందిస్తున్న ప్రోత్సాహంతో లక్షల కోట్లు పెట్టుబడులు ఈ రంగంలో జమ అవుతున్నాయి. ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ చిప్ డిజైన్, వెరిఫికేషన్, ఎస్ఓసీ డెవల్‌పమెంట్ నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు దానికి అవసరమవుతారు.

**సైబర్ సెక్యూరిటీ:**

బ్యాంకింగ్, టెలికామ్, ప్రభుత్వం, రక్షణ తదితర రంగాల్లో డిజిటల్ అడాప్షన్ పెరుగుతున్న కొద్దీ సైబర్ సెక్యూరిటీ క్లిష్టంగా మారుతోంది. అయితే మన దేశం ఇప్పుడు సరైన నైపుణ్యాలు కలిగిన సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ కొరతను ఎదుర్కొంటోంది.

**ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిగ్ డేటా**

అనలిటిక్స్: ఎఐ, డేటా అనలిటిక్స్ ఇప్పుడు పరిశ్రమల స్వరూపస్వభావాలనే మార్చేస్తున్నాయి. హెల్త్‌కేర్, ఫిన్‌టెక్ నుంచి తయారీ పరిశ్రమలు, ఈ-కామర్స్ వరకు అన్నింటా ఏఐ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులకు డిమాండ్ పెరుగుతోంది. అయితే సరైన ప్రాక్టికల్ ట్రైనింగ్ కొరవడిన కారణంగా ఇండస్ట్రీ అంచనాలతో పోల్చుకుంటే 30 నుంచి 50 శాతం మేర సంబంధిత శిక్షణ పొందిన మానవవనరుల కొరత కనిపిస్తోంది. సరిగ్గా ఈ నేపథ్యంలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపుపై పరిశ్రమలు దృష్టిసారించేలా చేస్తోంది. సదరు సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యం కలిగిన మానవవనరులను రూపొందించేందుకు సీడాక్ వివిధ పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలో పని చేస్తున్న స్వతంత్రప్రతిపత్తి కలిగిన సంస్థ సెంటర్ ఫర్ డెవల్‌పమెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడాక్). ముందుగా పేర్కొన్న అవసరాలకు తగిన విధంగా రూపొందించిన పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ల్లో అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎసఐ డిజైన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవల్‌పమెంట్, బిగ్ డేటా అనలిటిక్స్, ఐటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ తదితరాలు ఉన్నాయి. ఇవన్నీ 24 వారాల ప్రోగ్రామ్‌లు. లెర్నింగ్, ఎక్స్‌టెన్సివ్ ల్యాబ్ వర్క్, రియల్ వరల్డ్ ప్రాజెక్టులకుతోడు అనుభవజ్ఞులైన సైంటిస్టులు, ఇంజనీర్లు, ఇండస్ట్రీ నిపుణులతో లెక్చరర్లు కలగలిసిన కార్యక్రమంగా ఈ ప్రోగ్రామ్‌లను సీడాక్ తీర్చిదిద్దింది. 1200 గంటలకు మించి కఠినమైన ట్రైనింగ్ ఉంటుంది. దాంతో హ్యాండ్స్ అన్ ఎక్స్‌పోజర్‌కు అవకాశం ఉంటుంది. అందులో బాగంగా ఇండస్ట్రీ టూల్స్, టెక్నాలజీలు, బెస్ట్ ప్రాక్టీసెస్ అలవడతాయి. దానికి తోడు టెక్నికల్ స్కిల్స్ నేర్చుకుంటారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్, ప్లేస్‌మెంట్ రెడీనెస్ సహా ప్రొఫెషనల్ కార్యకలాపాల్లోకి నేరుగా చేరే విధంగా ఈ కోర్సులో చేరిన విద్యార్థులను తీర్చిదిద్దుతారు. అత్యున్నత ఎదుగుదల కలిగిన రంగాల్లో మంచి వేతనాలతో ప్రొఫెషనల్స్‌గా నిలదొక్కుకోగలుగుతారు. సంబంధిత నైపుణ్యాలను అలవర్చుకోవడం అన్నది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఇప్పుడు ఆప్షన్ ఎంత మాత్రం కాదు, అది అవసరమే అని గుర్తించాలి.



# సివిల్స్‌లో వైఫల్యం..

## అభ్యర్థులు ఎక్కువగా చేసే 6 పొరపాట్లు

ఏటా వేల మంది సివిల్స్ పరీక్షకు హాజరవుతుంటారు. కానీ చాలా మందికి విజయం అందని ద్రాక్షగానే మిగులుతుంది. మరికొందరేమో.. ఒకటి రెండు మార్కుల తేడాతో అద్భుత భవిష్యత్తుకు దూరమవుతారు. ఇలాంటి వారు సాధారణంగా కొన్ని పొరపాట్లు చేస్తుంటారని నిపుణులు చెబుతున్నారు. పరీక్ష సన్నద్ధమయ్యే క్రమంలో అవగాహనలేమితో చేసే పొరపాట్లే ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నారు (Civils Aspirants - Mistakes). మరి ఈ పొరపాట్లు ఏంటంటే..

ప్రిలిమ్స్ అంటే కచ్చితత్వానికి సంబంధించిన పరీక్ష. కానీ కొందరు అధికంగా ప్రశ్నలకు సమాధానాలు పెట్టి నెగెటివ్ మార్కులు తెచ్చుకుని వెనకబడుతుంటారు. పలు మాక్ టెస్టులు రాసుకుని పరీక్షకు సన్నద్ధమైతే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. రిస్కీ ప్రశ్నలు ఏవో తెలిసి వాటికి దూరంగా ఉండటం సాధ్యం అవుతుంది.

పోటీ పరీక్ష ఏదైనా ముందుగా సిలబస్‌పై అవగాహన తప్పనిసరి. కానీ కొందరు సబ్జెక్టులను వేర్వేరుగా చదువుతూ వాటిని లాజికల్‌గా అనుసంధానించాల్సిన విషయాన్ని మర్చిపోతారు. చివరకు లోతైన సమాధానాలు రాయలేక చివరకు పరీక్షలో విఫలం అవుతారు.

కొందరు ప్రశ్న పత్రం డిజైన్‌లో వస్తున్న మార్పులను పట్టించుకోరు. అసలు ప్రశ్నలను ఎలా రూపొందిస్తున్నారో అర్థం చేసుకోరు. ఇప్పటికే అభిప్రాయాలు, అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలు పెరుగుతున్నాయి. దీంతో, లోతైన అవగాహన లేని వారు ఇలాంటి ప్రశ్నలను అర్థం చేసుకోలేక బోల్తాపడుతుంటారు.

అద్భుతమైన లోతైన సమాధానాలు రాయాలంటే ప్రాక్టీస్ తప్పనిసరి. లేకపోతే ఇంట్రొడక్షన్, కాంక్లూషన్ సరిగా లేక ఇబ్బంది పడతారు. కాబట్టి అభ్యర్థులు తమ సమాధాలను నిపుణులతో ముదింపు వేయించుకుని వారి సలహాల మేరకు మార్పులు చేయాలి.

మంచి స్కోరు సాధించేందుకు ఆప్షనల్ సబ్జెక్టు చాలా కీలకమన్న విషయం మర్చిపోకూడదు. చాలా మంది ఇందులో మంచి స్కోరు సాధించలేక అంతిమంగా వెనకబడుతున్నారు. ఫైనల్ లిస్టుకు అర్హత సాధించలేకపోవడానికి ఇదీ ఒక ప్రధాన కారణం.

కొందరు ఏళ్ల తరబడి ప్రీపేర్ అవుతూ మానసిక అలసటకు లోనవుతారు. మునుపటి ఉత్సాహం, ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది. విషయాలు త్వరగా గుర్తుకు రావు. కాబట్టి, ఇలాంటి వారు చదువుకు నుంచి క్రమం తప్పకుండా విరామం తీసుకుంటూ ఉత్సాహాన్ని మళ్లీ కూడగట్టుకుని ముందుకు వెళితే మంచి ప్రయోజనం ఉంటుంది.



# ఎదురులేని భారత్..

## లంకపై వరుసగా నాలుగో విజయం
## స్మృతి, షెఫాలీ వీరవిహారం





తిరువనంతపురం: సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ఆదివారం తిరువనంతపురం వేదికగా భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. 30 రన్స్ తేడాతో గెలుపొంది సిరీస్‌లో ఆధిక్యాన్ని 4-0కు పెంచుకుంది. మ్యాచ్‌లో తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 20 ఓవర్లకు రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 221 రన్స్ చేసింది. ఓపెనర్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' స్మృతి మంధాన (48 బంతుల్లో 80, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) తిరిగి ఫామ్‌లోకి రాగా షెఫాలీ వర్మ (46 బంతుల్లో 79, 12 ఫోర్లు, 1 సిక్స్) హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో కదం తొక్కింది.

రిచా ఘోష్ (16 బంతుల్లో 40 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో టీ20ల్లో భారత్.. తమ అత్యుత్తమ స్కోరును నమోదుచేసింది. ఇక ఛేదనలో లంక ధాటిగానే ఆడినా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 191 రన్స్ చేసింది. కెప్టెన్ చమారి ఆటపట్టు (37 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), హాసిని పెరీరా (33), ఇమేషా దులానీ (29) రాణించారు. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ (2/24), అరుంధతి రెడ్డి (2/42)కి తలా రెండు వికెట్లు దక్కాయి. సిరీస్‌లో ఆఖరిదైన ఐదో మ్యాచ్ ఈనెల 30న ఇదే వేదికలో జరుగుతుంది.

### పదివేల పరుగుల క్లబ్‌లో..

ఈ మ్యాచ్‌లో స్మృతి మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 27 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్లలో కలిపి) పదివేల పరుగులు పూర్తిచేసిన నాలుగో క్రికెటర్‌గా (భారత్ నుంచి రెండో ప్లేయర్)గా రికార్డులకెక్కింది. మహిళా క్రికెట్‌లో ఈ ఘనతను అందుకున్నవారిలో మిథాలీ రాజ్ (314 ఇన్నింగ్స్‌ల్లో 10,868), న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ (343 ఇన్నింగ్స్‌ల్లో 10,652), ఇంగ్లండ్‌కు చెందిన చార్లెస్ ఎడ్వర్డ్స్ (316 ఇన్నింగ్స్‌ల్లో 10,273) మంధాన కంటే ముందున్నారు.

అయితే ఈ నలుగురిలో అత్యంత వేగంగా పదివేల పరుగుల మైలురాయిని అందుకున్నది మాత్రం స్మృతి (280 ఇన్నింగ్స్‌ల్లోనే)యే కావడం విశేషం. అలాగే ఈ మ్యాచ్‌లో 3 సిక్సర్లు కొట్టిన ఆమె.. భారత్ తరఫున ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్స్ (80)లు కొట్టిన హర్మన్‌ప్రీత్ రికార్డు (78)ను అధిగమించింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 221/2 (స్మృతి 80, షెఫాలీ 79, షెహానీ 1/32, మధుశాని 1/40)బీ

శ్రీలంక: 20 ఓవర్లలో 191/6 (ఆటపట్టు 52, హాసిని 33, వైష్ణవి 2/24, అరుంధతి 2/42)



# హంపికి కాంస్యం

దోహా: భారత వెటరన్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి దోహాలో జరుగుతున్న వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఆమె.. 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించింది.

అలగ్జాండ్ర (రష్యా), జినర్ (చైనా)తో కలిసి సంయుక్తంగా 8.5 పాయింట్లు సాధించినా టైబ్రేకర్ స్కోరు తక్కువగా ఉండటంతో హంపి మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో హంపికి ఇది ఐదో పతకం కావడం విశేషం.

# భారత్ తరఫున ఆడాడని.. పాక్ కబడ్డీ ఆటగాడిపై వేటు




కరాచీ: ప్రముఖ పాకిస్థానీ కబడ్డీ ఆటగాడు ఉబైదుల్లా రాజ్‌పుత్‌కు ఆ దేశ కబడ్డీ సమాఖ్య షాకిచ్చింది. కొద్దిరోజుల క్రితం బహ్రెయిన్‌లో జరిగిన ఒక ప్రైవేట్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఉబైదుల్లా.. భారత్‌కు చెందిన ఓ జట్టుకు ఆడటమే గాక భారత జాతీయ జెండాను భుజంపై వేసుకున్నాడనే కారణంతో పాకిస్థాన్ కబడ్డీ ఫెడరేషన్ (పీకేఎఫ్) అతడిపై వేటు వేసింది.

ఉబైదుల్లా భారత జెర్సీ, జెండా ధరించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవడంతో వివాదం చెలరేగింది. పీకేఎఫ్ నుంచి ఎన్‌వోసీ తీసుకోకపోవడంతో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఉబైదుల్లాపై వేటు పడింది.

# గంభీర్‌పై మాకు నమ్మకముంది..

## కోచ్ మార్పు వార్తలు ఊహాగానాలే.. బీసీసీఐ క్లారిటీ



ముంబై: భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను టెస్టుల్లో తొలగించి ఆ బాధ్యతలను దిగ్గజ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు అప్పగిస్తారని వస్తున్న వార్తలపై బీసీసీఐ స్పందించింది. అవన్నీ ఊహాజనితమని, అసలు అలాంటి చర్చే జరుగలేదని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ.. 'కోచ్ మార్పుపై వస్తున్న వార్తలు అవాస్తవం. అవన్నీ పూర్తిగా ఊహాజనితమైనవి. కొన్ని ప్రముఖ న్యూస్ ఏజెన్సీలు కూడా ఇలాంటివి ప్రచారం చేయడం సరికాదు. అసలు బోర్డులో అలాంటి (కోచ్ మార్పు) చర్చే జరుగలేదు. కొంతమంది వారికి తోచిన విధంగా ఆలోచించి దానిని నిజమని ప్రచారం చేస్తుంటారు. గంభీర్ కాంట్రాక్టు 2027 ప్రపంచకప్ వరకూ ఉంది. అతడిపై మాకు పూర్తి నమ్మకముంది. మేం ఎవరినీ సంప్రదించలేదు' అని తెలిపాడు.

# క్యాచ్ పడితే కోటి



కేప్‌టౌన్: అభిమానులను మైదానానికి రప్పించేందుకు గాను దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తీసుకొచ్చిన కాంటెస్ట్ (క్యాచ్2మిలియన్).. మ్యాచ్‌లు చూసేందుకు వచ్చిన ఫ్యాన్స్‌కు కనవర్షం కురిపిస్తున్నది. ఎస్ఏ 20 తాజా సీజన్‌లో భాగంగా మ్యాచ్‌లకు వచ్చే అభిమానుల్లో ఎవరైనా క్లీన్, వన్ హ్యాండెడ్ క్యాచ్‌లు అందుకుంటే వారికి 2 మిలియన్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 1.07 కోట్లు) అందజేస్తామని దక్షిణాఫ్రికా బోర్డు ప్రకటించింది.

కాగా, ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ చాంపియన్స్ ఎంఐ కేప్‌టౌన్.. డర్బన్ సూపర్ జెయింట్స్ మ్యాచ్‌తో పాటు ప్రిటోరియా క్యాపిటల్స్, జోబర్గ్ సూపర్ కింగ్స్ పోరులో ఇద్దరు అభిమానులు క్యాచ్‌లు అందుకుని జాక్‌పాట్ కొట్టారు. కేప్‌టౌన్ బ్యాటర్ వికెట్ కీపర్ బ్యాటర్ రియాన్ రికెల్టన్ (113) డర్బన్‌తో మ్యాచ్‌లో 11 సిక్సర్లు కొట్టగా అందులో ఒకదానిని స్టాండ్స్‌లో ఉన్న అభిమాని సింగిల్ హ్యాండ్‌తో అందుకుని కాంటెస్ట్ విన్నర్‌గా నిలిచాడు. ప్రిటోరియా, జోబర్గ్ సూపర్ కింగ్స్ మ్యాచ్‌లోనూ మరో అభిమాని ఇలాగే క్యాచ్ అందుకున్నాడు.

# ఉపాధి హామీపై కేంద్రం కుట్ర





## కాంగ్రెస్ నేతల ధ్వజం
## ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

చిగురుమామిడి,జనత న్యూస్: ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఆదివారం చిగురుమామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఆకలి చావులు ఉండకూడదని, పేదలకు పని కల్పించాలనే సమున్నత లక్ష్యంతో కాంగ్రెస్ హయాంలో తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని ధ్వజమెత్తారు. జాతిపిత పేరు చరిత్రలో ఉండకూడదనే దురుద్దేశంతోనే పథకం నుంచి ఆయన పేరును తొలగించారని ఆరోపించారు. గతంలో ఈ పథకానికి కేంద్రమే పూర్తి నిధులు ఇచ్చేదని, ఇప్పుడు 40 శాతం నిధులు రాష్ట్రాలే భరించాలంటూ కొత్త నిబంధనలు పెట్టి పథకాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారని మండిపడ్డారు. పథకం పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పేదల పొట్ట కొట్టే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, డీసీసీ జనరల్ సెక్రెటరీ చిట్టిమల్ల రవీందర్, డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి. షాబుద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బోడిగె పర్శరాములు, ఎండి. కుత్బొద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిన వేణుగోపాల్ పాల్గొన్నారు. వీరితో పాటు మండల మీడియా కన్వీనర్ జిల్లెల్ల రమేష్, ఉపాధ్యక్షుడు పచ్చిమట్ల జగన్, సర్పంచులు చింతపుల నరేందర్ (ఇందుర్తి), మార్క రాజు (కొండాపూర్), అలువల శంకర్ (ఉల్లంపల్లి), గుళ్ల రజిత రాజు (నావపేట), నాయకులు ఇనుగాల శ్రీనివాసరెడ్డి, గాదపాక సునీల్, ఎలగందుల లక్ష్మణ్, రాణా ప్రతాప్ సింగ్, గట్టు ప్రశాంత్ తదితర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పేరు మార్పుపై కాంగ్రెస్ నిరసన



హుస్నాబాద్,జనత న్యూస్: కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ... 2005వ సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు, వలసల నివారణకు ఈ పథకాన్ని చట్టబద్ధం చేసి అమలు చేశారని గుర్తు చేశారు. గాంధీజీ కన్న కలలైన గ్రామ స్వరాజ్యాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే బీజేపీ ప్రభుత్వం పథకం నుంచి గాంధీ పేరును తొలగించిందని వారు మండిపడ్డారు. పథకానికి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ అని పేరు మార్చడమే కాకుండా, 60:40 నిధుల విధానాన్ని ప్రవేశపెట్టి పథకాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. అనవసర సాంకేతిక పరిజ్ఞానాన్ని జొప్పించి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, డీసీసీ అధికార ప్రతినిధి చిత్తారి రవీందర్, గుర్రాల లింగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, వల్లపు రాజు, వెన్న రాజు, మైదంశెట్టి వీరన్న, నాయిని రజిత, దండి లక్ష్మి, వి.వి. రమణ, కేశవేని రమేష్, భూక్యా రమేష్ నాయక్, వేల్ప సంపత్, బెజ్జంకి బాబు, బూరుగు కిష్టస్వామి, పలువురు మాజీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుందరగిరిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం




చిగురుమామిడి,జనత న్యూస్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు సుందరగిరి గ్రామంలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజు ఆదివారం నాడు విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మార్గదర్శకత్వంలో వాలంటీర్లు ఉదయాన్నే గ్రామ పరిసరాల్లో శ్రమదానం నిర్వహించి, పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. గ్రామంలో విచ్చలవిడిగా పడి ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఏరి ఒకచోట చేర్చి, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలకు పాదులు తీయడం, గడ్డిని తొలగించడం వంటి పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలోని నీటి ట్యాంకు వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా, అది సులభంగా బయటకు వెళ్లేలా కాలువను తవ్వారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. వ్యసనాల వల్ల కలిగే సామాజిక, ఆర్థిక ఇబ్బందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సేవా కార్యక్రమాలను ఉద్దేశించి గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అభినందనీయమని కొనియాడారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ ద్వారా యువతలో మార్పు వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. ఇందిర నయనాదేవి, అధ్యాపకులు డాక్టర్ అనిల్ కుమార్, శ్రీనివాస్, వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

## బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్



హుస్నాబాద్,జనత న్యూస్: 2019-2024 కాలంలో పనిచేసిన మాజీ సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పాత బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం, పైప్‌లైన్ల మరమ్మతులు, తాగునీటి మోటార్ల పనులను సర్పంచులు తమ సొంత నిధులతో పూర్తి చేశారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా 2020-21లో కరోనా కారణంగా నిధులు రాకపోయినా, పనులు ఆపకుండా కొనసాగించారన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది సర్పంచులు సుమారు 530 కోట్ల రూపాయల మేర బకాయిలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం సర్పంచులు తమ భూములను తాకట్టు పెట్టారని, భార్యాపిల్లల నగలను కుదువ పెట్టి అప్పులు తెచ్చారని రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో అప్పుల బాధ తాళలేక కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నందున, ఆ నిధులతో పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపడుతున్న తరుణంలో, పాత సర్పంచుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని బీఎస్పీ పక్షాన డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు వెలుపుల రాజు, విక్రమ్, పర్షయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు ఆదర్శంగా నిలవాలి

### ఓసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్పంచులకు ఘన సన్మానం



చిగురుమామిడి,జనత న్యూస్: గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలవాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చిగురుమామిడి మండలంలోని ఏడు గ్రామాల సర్పంచులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఎన్నికల్లో సర్పంచులుగా విజయం సాధించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సత్కారం పొందిన వారిలో సుందరగిరి సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి, లంబాడిపల్లి సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, సీతారాంపూర్ సర్పంచ్ గోగురి లక్ష్మీ మురహరి రెడ్డి, రామంచ సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి, గుణుకులపల్లి సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి, పీచుపల్లి సర్పంచ్ పీచు సత్యనారాయణ రెడ్డి, ఓగులాపూర్ సర్పంచ్ గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలు నమ్మకంతో గెలిపించిన ప్రజాప్రతినిధులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించాలని, గ్రామాల ప్రగతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు సుదర్శన్ రెడ్డి, చిగురుమామిడి మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, లంబాడిపల్లి రెడ్డి సంఘం అధ్యక్షుడు పింగిలి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రాకేష్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బత్తుల రాకేష్ రెండోసారి నియామాకం అయ్యారు. తిమ్మాపూర్ ప్రెస్ క్లబ్ నూతన పాలకవర్గ నియామాకం ఆదివారం శ్రీ తాపాల లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో ఎన్నికల అధికారులు ముస్కు లక్ష్మారెడ్డి, సిరిసిల్ల ఆనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ద్వితీయ సంవత్సరం జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితోపాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల నియామాకమయ్యారు. అధ్యక్షునిగా సాక్షి దినపత్రిక విలేకరి బత్తుల రాకేష్ పోటీలో వియజయ సాధించారు. ప్రధాన కార్యదర్శిగా నమస్తే తెలంగాణ రిపోర్టర్ వేల్పుల రాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా ఎండీ రహీమ్(బిగ్ టీవీ), నాగెల్లి ఆంజనేయులు (మైత్రీ ఛానల్, హెచ్‌ఎం టీవీ), కోశాధికారిగా నమస్తే తెలంగాణ రూరల్ రిపోర్టర్ భూమాడి శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా తూముల శ్రీనివాస్, గోనె విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులుగా జాప నాగరాజు, మర్రి రవి కుమార్, బొమ్మాడి విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని ఎన్నికల అధికారులు అనిల్ కుమార్, లక్ష్మారెడ్డితోపాటు సభ్యులు అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షుడు రాకేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ పాలకవర్గం, సభ్యుల సహకారంతో సమస్యల పరిష్కారంకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండలంలోని అన్నీ పార్టీల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

## తిమ్మాపూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా పొన్నం సునీత



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం సర్పంచ్ ల ఫోరంను ఆదివారం నియమించుకున్నట్లు మండల సర్పంచుల ఫోరం సభ్యులు తెలిపారు. తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సర్పంచ్ ల ఫోరం తెలిపింది. ఫోరం గౌరవ అధ్యక్షులుగా తాట్ల తిరుపతి (మొగిలిపాలెం), గౌరవ సలహాదారులుగా సురం స్వప్న మహేందర్ రెడ్డి (పర్లపల్లి), ఉపాధ్యక్షులుగా గాండ్ల శ్రీనివాస్ (మక్తపల్లి), మామిడి మమతా సతీష్ (మల్లాపూర్), కనకం లక్ష్మి కొమురయ్య (నేదునూర్), ప్రధాన కార్యదర్శిగా ఆవుదుర్తి రామకిషన్ (ఇందిరానగర్), కోశాధికారిగా గోదరి శోభారాణి(కొత్తపల్లి), కార్యదర్శులుగా పిస్క సౌజన్య కృష్ణ కిషోర్ (రామ్ హనుమాన్ నగర్), దుర్గం శ్రీనివాస్ (బాలయ్యపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణికుంట సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, రామక్రిష్ణ కాలనీ సర్పంచ్ గుజ్జుల శ్వేత ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి ఎన్నిక



హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సత్తు మహిపాల్ రెడ్డి (సూర్య దినపత్రిక), ఉపాధ్యక్షులుగా ఆకుల రాజు (తెలంగాణవాణి), మస్త్యాల యాదగిరి (సూర్య) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఖుద్రత్ అలీ (విజన్ ఆంధ్ర), కోశాధికారిగా కుడిక్యాల సంపత్ (దిశ), సహాయ కార్యదర్శులుగా గొట్టెం కోటేశ్వర రావు, ఎడబోయిన శ్రీనివాస రెడ్డి (జనం సాక్షి) బాధ్యతలు చేపట్టారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వరయోగుల మురళీధర్ ఎన్నికవగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్ (ప్రజాదర్బార్), చెరుకు సతీష్ (సుమన్ టీవీ), గుంటిపల్లి శ్రీనివాస్ (సీవీఆర్), ధర్మపురి సందీప్ (పీపుల్స్ డైరీ) నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వృత్తిపరమైన విలువలను కాపాడుతూ జర్నలిస్టులందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన సంవత్సర వేడుకలపై పోలీసుల కఠిన ఆంక్షలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: సీపీ గౌస్ ఆలం**



కరీంనగర్, జనతా న్యూస్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా డిసెంబర్ 31 రాత్రి ప్రత్యేక ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు.

నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, హుందాగా జరగాలనే ఉద్దేశంతో కరీంనగర్ నగరం సహా కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు సీపీ వెల్లడించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం**

కమిషనరేట్ పరిధిలో మొత్తం 44 ప్రాంతాల్లో (మున్సిపల్ పరిధిలో 33 చోట్ల) డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి చెకింగ్ పాయింట్ వద్ద 8–10 మంది సిబ్బందితో పాటు బ్రెత్ అనలైజర్లు, బాడీ వార్న్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డ్యామ్ కట్ట, తీగల వంతెనపై నిషేధం**

డిసెంబర్ 31 రాత్రి లోయర్ మానేరు డ్యామ్ (LMD) కట్ట మరియు తీగల వంతెన (కేబుల్ బ్రిడ్జి) ప్రాంతాల్లోకి వెళ్లడం, అక్కడ వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో నిరంతర పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుందని చెప్పారు.

**డీజేలు, బాణాసంచాపై పూర్తి నిషేధం**

డీజేల వినియోగం, అధిక శబ్దాలతో వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషిద్ధమని సీపీ స్పష్టం చేశారు. ధ్వని కాలుష్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో టపాసులు పేల్చిన వారిపై సెక్షన్ 188 ఐపీసీ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా**

నగర శివార్లలోని గెస్ట్ హౌస్‌లు, ఫామ్ హౌస్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించేందుకు నార్కో టీమ్స్, శిక్షణ పొందిన జాగిలాలు, డ్రగ్ డిటెక్ట్ కిట్లు వినియోగిస్తామని చెప్పారు. పట్టుబడిన వారిపై NDPS చట్టం ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

**కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్,జనతా న్యూస్ : ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా సోమవారం నుంచి కొనసాగించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ డివిజన్లలో జెండా ఆవిష్కరణ



కరీంనగర్,జనతా న్యూస్ : జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ పతాకాలను ఘనంగా ఆవిష్కరించారు. వందేమాతరం గీతం ఆలపిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాలకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ 1885లో 72 మంది మేధావులతో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, డా. బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహానుభావుల సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, స్వాతంత్ర్యం అనంతరం దేశ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వంలో దేశం–%రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని డివిజన్ నెం.2, 3, 8, 9, 14, 15, 16, 25, 30, 31, 43, 59, 64 తదితర డివిజన్లలో స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడంతో నగర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

# భక్తితో కరీంనగర్‌లో సామూహిక గీత-లలిత సహస్రనామ పారాయణం





కరీంనగర్,జనతా న్యూస్ : ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచేలా గీత భక్త సమాజం కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా శ్రీ భగవద్గీత, శ్రీ లలిత సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి దాదాపు 1500 మంది భక్తులు భక్తి శ్రద్ధలతో గీతలోని 18 అధ్యాయాలు, 701 శ్లోకాల సామూహిక పారాయణం చేయగా, సాయంత్రం గాంధీ రోడ్డులోని వైశ్య భవన్ వేదికగా శ్రీ లలిత సహస్రనామ స్తోత్ర గళ పారాయణం నిర్వహించారు.

కార్యక్రమ నిర్వాహకులు భక్తులకు గీత గ్రంథంతో పాటు 300 పేజీల శ్రీ లలిత సహస్రనామ స్తోత్రం తాత్పర్య గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయడం విశేషం. అదేవిధంగా ప్రతి భక్తునికి మల్టీకలర్ సిల్క్ కండువా అందజేశారు. ఉదయం ఉపహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఈ ఆధ్యాత్మిక సమ్మేళనం బండ సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి, శ్రీ సంపూర్ణ నందగిరి స్వామి, పరబ్రహ్మ నందగిరి స్వామి, చిదానంద గిరి స్వామి, సనకాసనానందగిరి స్వామి, సత్యనంద స్వామి, నమిలికొండ రమణాచార్యులు, భక్త రాజేశం పాల్గొని ధార్మిక%–%ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు.

కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు కొమురవెల్లి వెంకటేశం, రాచమళ్ళ ఆంజనేయులు, గుండ రాధాకిషన్, చిట్టీమల్ల దామోదర్, కాసం సుదర్శన్, తోడుపునూరి దశరథం, అల్లె చిన్న వెంకటయ్య, గంగిశెట్టి సత్యనారాయణ, ఉప్పల రామేశం భక్తులకు సౌకర్యాలు కల్పించారు. గీత మందిరం ప్రధాన అర్చకులు చల్లూరి విష్ణుమూర్తి, మల్లికార్జున శాస్త్రి, చల్లూరి రంజిత్ శర్మ వేదికపై ఏర్పాటు చేసిన వివిధ దేవతల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. స్వామీజీలను వస్త్రాలు, దక్షిణతో సత్కరించారు. భక్తుల విస్తృత పాల్గొనడంతో కరీంనగర్ నగరం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇలాంటి సామూహిక పారాయణాలు సమాజంలో శాంతి, సద్భావన పెంపొందిస్తాయని భక్తులు అభిప్రాయపడ్డారు.

# గ్రామాభివృద్ధి బాధ్యత సర్పంచులదే: డా. వి. నరేందర్‌రెడ్డి



కరీంనగర్, జనతా న్యూస్: గ్రామాల అభివృద్ధి దిశను నిర్ణయించే కీలక భూమిక సర్పంచులదేనని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాలను అన్ని రంగాల్లో ముందుకు నడిపించాల్సిన బాధ్యత వారిపైనే ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్ఫోర్స్ డా. వి. నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా ఓసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కమాన్ రోడ్డులో గల శుభమంగళం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ పరిపాలనలో పారదర్శకత, సమిష్టి నిర్ణయాలు, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు రాజకీయాలకు అతీతంగా గ్రామ సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహాయం ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సర్పంచులకు అభినందనలు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధిపై సర్పంచుల్లో కొత్త ఉత్సాహం నింపిన ఈ సమ్మేళనం సానుకూల సందేశాన్ని పంపిందని హాజరైన నాయకులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యం

**చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం**



కరీంనగర్,జనతా న్యూస్ : భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి, దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన పార్టీ కాంగ్రెస్ అని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం అన్నారు. జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును పార్టీ శ్రేణుల సమక్షంలో కట్ చేసి కార్యకర్తలకు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1885లో స్థాపించబడిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేటితో 141 సంవత్సరాలు పూర్తయ్యాయని గుర్తు చేశారు. దేశ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని, మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ వంటి మహానుభావుల నాయకత్వంలో సాగిన పోరాట ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కనీస మౌలిక వసతులు కూడా లేని పరిస్థితుల్లో జవహర్లాల్ నెహ్రూ దార్శనికతతో పంచవర్ష ప్రణాళికలు అమలు చేసి, పెద్ద ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆహార భద్రత వంటి కీలక రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశంతో మతతత్వ, ప్రాంతీయ శక్తులు ఎన్నో కుట్రలు పన్నినా 141 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసాన్ని చూరగొని కాంగ్రెస్ పార్టీ వారి గుండెల్లో నిలిచిపోయిందన్నారు. భవిష్యత్తులో కూడా దేశ అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుందనే నమ్మకం ప్రతి భారతీయుడిలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఆరేపల్లి మోహన్, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఎండి తాజ్, పత్తి మధుకర్ రెడ్డి, మడుపు మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, మల్యాల సుజిత్ కుమార్, చర్ల పద్మ, వెన్నం రజిత రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రహమాన్, మహమ్మద్ అజీమ్, ములకల ప్రవీణ్, మునిగంటి అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com